ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మెదక్
20
శనివారం 5 ఆగస్టు 2017



మైనింగ్ అక్రమాలకు చెక్




- శాటిలైట్ ద్వారా రిమోట్ సెన్సింగ్
- రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లా ఎంపిక
- శిక్షణకు గుజరాత్ తరలివెళ్లిన అధికారులు

5

రెసికోలో శిక్షణ పొందుతున్న మైనింగ్ అధికారులు

నత్తనడకన డబుల్‌బెడ్రూం


జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. చాలా చోట్ల ఇళ్ల నిర్మాణాల పనులు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లోపు కట్టడాలను పూర్తిచేసి గృహప్రవేశాలు పూర్తిచేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉండగా.. గిట్టుబాటు రావడం లేదంటూ పనులను చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రాయితీపై సామగ్రి ఇస్తున్నా ఆశించిన రీతిలో స్పందన లేదు. పొరుగున ఉన్న జిల్లాల్లో ప్రజాప్రతినిధుల చొరవతో చకచకా నిర్మాణాలు పూర్తయి ఎంచక్కా గృహప్రవేశాలు జరిగి పోతున్నాయి. ఇక్కడ ఆ యోగం ఎప్పుడొస్తుందా? అంటూ జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు.



మెదక్ మండలంలో నిర్మాణం జరుగుతున్న డబుల్ బెడ్రూం ఇళ్లు

- జిల్లాలో నిదానంగా సాగుతున్న పనులు
- మూడు నియోజకవర్గాల్లో ఇంకా పడని పునాది రాయి
- సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే రెండు చోట్ల గృహ ప్రవేశాలు
- రాయితీలిస్తున్నా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- చాలా చోట్ల స్థలాలు దొరక్క ఇబ్బందులు

5 లో



ఆర్డీవో సంతకాలు లేకుండా ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు

పది వేలిస్తేనే పాతీ మార్పిడి!

- భార్య పుస్తెలమ్మి వీఆర్వోకు అందజేసిన రైతు
- ఏడాది గడుస్తున్నా అందని పట్టాదారు పాసు పుస్తకాలు
- న్యాయం చేయండని గోడు వెళ్లబోసుకున్న మల్లయ్య

5

'టెట్' లో ప్రతిభ చూపిన విద్యార్థి

5

- 'టెట్' పేపర్-1లో 61.93 శాతం
- పేపర్-2లో 18.60% ఉత్తీర్ణత
- 120 మార్కులు సాధించిన నవీన్

కాంట్రాక్టర్ కక్కుర్తితో గొర్రెలు బలి



- లారీల్లో గొర్రెలు కుక్కి రవాణా
- 5 యూనిట్లకు బదులు 6 యూనిట్లు
- తూప్రాన్‌కు వచ్చిన 11 గొర్రెలు మృతి

3

మృతిచెందిన గొర్రెల వద్ద బాధపడుతున్న లబ్ధిదారులు



పెద్దశంకరంపేటలో సరస్వతి శిశుమందిర్‌లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

వరాలివ్వు.. మహాలక్ష్మీ

జిల్లాలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలతో ఆలయాలన్నీ కిక్కిరిసిపోయాయి. మహిళలు పిల్లా పాపలతో వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య సామూహిక వ్రతాలు చేశారు. సుఖసంతోషాలతో చల్లగా చూడాలని అమ్మకు మొక్కులు తీర్చుకున్నారు.

లోపలిపేజీల్లో

ఇంటర్వ్యూ



విద్యుత్‌ను వృథా చేయొద్దు

• సిద్దిపేట జిల్లా విద్యుత్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కరుణాకర్‌బాబు

సిద్ధిపేట మునిసిపాలిటీ : విద్యుత్‌ను వృథా చేయకుండా అవసరం మేరకు వాడుకోవాలని జిల్లా విద్యుత్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కరుణాకర్‌బాబు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

జిల్లాలో ఎన్ని వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి ?

సిద్ధిపేట జిల్లాలో మొత్తం లక్షా 34 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాతో పడుతున్న అదనపు భారం ఎంత?

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందువల్ల కచ్చితమైన లెక్క తెలియట్లేదు. ఈ రెండు రోజులలో ఒక మిలియన్ అదనపు యూనిట్ల వాడకం మాత్రం పెరిగింది.

జిల్లాలో ఉన్న మొత్తం సబ్‌స్టేషన్లు, ఫీడర్ల సంఖ్య ఎంత?

జిల్లాలో మొత్తం 139 సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. 132/33 కేవీ స్టేషన్‌లు 12 ఉన్నాయి. ఇండోర్ సబ్ స్టేషన్ ఒకటి ఉన్నది. 33 కేవీ ఫీడర్లు 65 వరకు ఉన్నాయి. మొత్తం ట్రాన్స్‌ఫార్మర్లు 25 వేలు ఉన్నాయి.

సాగుకు 24 గంటల సరఫరా దృష్ట్యా రైతులకు ఇచ్చే సూచనలు ?

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఉన్నందువల్ల వారు మొదటగా ఆటోమెటిక్ స్టార్టర్‌లను ఉపయోగించుకోకూడదు. వారి వారి పంటలకు అవసరమున్నంత మేరకే నీటి వినియోగం నిమిత్తం విద్యుత్‌ను వాడుకోవాలి. విద్యుత్‌ను వృథా చేయరాదు.

సంస్కృతి

- ఏడేళ్లుగా భక్తిగీతాలు, భజన కార్యక్రమాల
- ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తున్న తిరుమల తిరుపతి భజన మండలి
- ఏదాదికి రెండుసార్లు తిరుపతిలో అఖండ హరినామ సంకీర్తనతో ప్రదర్శన
- రెండు నెలలకోసారి భద్రాచలం రాములోరి చెంత భజన
- పలు పోటీల్లో పాల్గొన్న బృంద సభ్యులు
- రాష్ట్ర స్థాయిలో సాధించిన బహుమతులు కైవసం

భజన మండల పోటీల్లో పాల్గొన్న తిరుమల తిరుపతి భజన మండలి సభ్యులు (ఫైల్)



వేడుకుందామా..!

హుస్నాబాద్ : భజన గీతాలతో మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెబుతున్నారు హుస్నాబాద్ పట్టణానికి చెందిన తిరుమల తిరుపతి భజన మండలి సభ్యులు. తమ ప్రదర్శనలతో ఈ ప్రాంతానికి వన్నె తెస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రల్లో ఈ భజన మండలి ఆధ్వర్యంలో వందలాది ప్రదర్శనలు ఇచ్చారు.ఇంతే కాదు భజన పోటీల్లో తమ ప్రతిభను కనబర్చి బహుమతులను సాధిస్తూ ప్రముఖుల మన్ననలను పొందుతున్నారు. ముఖ్యంగా ఆలయాల్లో భక్తి గీతాలతో భజనలు చేస్తూ ఆధ్యాత్మికత చింతనను పెంపొందిస్తున్నారు. భజనతో భగవన్నామ స్మరణ చేస్తే మనస్సు ఉల్లాసంగా ఉండటమే కాకుండా ఎంతో పుణ్యం దక్కుతుందని పేర్కొంటున్నారు భజన బృందం సభ్యులు.

2010 సంవత్సరంలో హుస్నాబాద్ పట్టణంలో తిరుమల తిరుపతి భజన మండలిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నిత్య సాధన చేస్తూ రాష్ట్రస్థాయిల్లో మంచి భజన మండలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. డోలక్, కంజర, తాళాలు, గజ్జెలు, హార్మోనియం వాయిద్యాలతో లయబద్ధంగా కీర్తనలు పాడుతూ ప్రజల నుంచి ప్రశంసలు పొందుతున్నారు. వినాయక నవరాత్రోత్సవాలు, దేవి నవరాత్రోత్సవాలు, సత్యనారాయణ వ్రత పూజలు, ఆలయాల్లో భక్తి కార్యక్రమాలు, సంతాప సభలు వంటి కార్యక్రమాల్లో భజన ప్రదర్శనలు ఇస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమానికి ఆలయ అధికారుల ఆహ్వానం మేరకు సంవత్సరంలో రెండుసార్లు భజన సంకీర్తన ప్రదర్శనలు ఇస్తున్నారు. భద్రాచల రాములవారి ఆలయంలో రెండు నెలలకోసారి భజనలు చేసి వస్తున్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహ ఆలయంలో ప్రదర్శనలు ఇచ్చామని మండలి సభ్యులు తెలిపారు. ప్రతి సోమవారమూ హుస్నాబాద్ పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలో, ప్రతి శనివారమూ పార్థసారధి గీత మందిరంలో భజనలతో నిత్య సాధన చేస్తుంటారు.

18 మంది భజన మండలి సభ్యులు

తిరుమల తిరుపతి భజన మండలిలో 18 మంది సభ్యులున్నారు. మండలికి అధ్యక్షుడిగా బొద్దుల శ్రావణ్‌కుమార్, కార్యదర్శిగా శ్రీమంతుల నరేంద్రచారి, ఉపాధ్యక్షుడిగా బొద్దుల లింగయ్య, సభ్యులుగా పొదిల వెంకటేశం, కొత్తపల్లి రాజేందర్, నన్నె కిషన్, సంఘ రాజశేఖర్, కట్టోజు శ్రీనివాస చారి, మోర శ్రీహరి, కన్నోజు చొక్కాచారి, ధర్మపురి శ్రీకాంత్, కనపర్తి సత్యనారాయణ, శ్రీమంతుల రాజు, బోగ మహేశ్వర్, చిలుక రమేష్, మ్యాన కనుకయ్య, శివకుమార్‌లున్నారు.



భజన చేస్తున్న తిరుమల తిరుపతి భజన మండలి సభ్యులు (ఫైల్)

భజన కళను కాపాడుకునేందుకే




అంతరించి పోతున్న భజన కళను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఏడు సంవత్సరాల క్రితం ఈ భజన మండలిని ఏర్పాటు చేశాం. నిత్యం సాధన చేస్తూ వందలాది ప్రదర్శనలు ఇచ్చాం. డబ్బుల కోసం కాకుండా భగవన్నామస్మరణకు ఈ కళ ఎంతో దోహదం చేస్తుంది. భజన అంటే వృద్ధులే ఉంటారని అంటారు. కానీ మా భజన మండలిలో చాలా మంది యువకులే ఉన్నారు. ఒక గంట భజన చేస్తే మనస్సు ఆనందంగా ఉంటుంది. ఈ కళకు ప్రభుత్వం చేయూతను అందించాలని కోరుతున్నాం.

- బొద్దుల శ్రావణ్‌కుమార్,
భజన మండలి అధ్యక్షుడు,హుస్నాబాద్

పీఎఫ్ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించాలి

ఉద్యోగపర్వం

• ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్‌రావు



పటాన్‌చెరు : జిల్లాకు చెందిన లక్షలాది కార్మికులకు ఉపయోగపడుతున్న పటాన్‌చెరు పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయానికి పక్కా భవనం నిర్మించాలి. రెండున్నర దశాబ్దాలుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న పీఎఫ్ కార్యాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించడంలో ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయి. గతంలో అమీన్‌పూర్‌లో స్థలం కేటాయించామని ప్రకటించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. పటాన్‌చెరులో అద్దెభవనంలో కొనసాగుతున్నా ఎప్పుడు ఖాళీ చేయాల్సి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. గతంలో భవన యజమాని అగ్రిమెంట్ పూర్తి కాగానే ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తే బర్కత్‌పురాలోని ప్రధాన కార్యాలయానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అనేక పోరాటాలు చేసి పీఎఫ్ కార్యాలయం తరలివెళ్లకుండా అడ్డుకున్నాం. ప్రస్తుత ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకుని పక్కా భవనాన్ని ఇక్కడే శాశ్వతంగా నిర్మించి ఇస్తే కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

భక్తుల కోర్కెలు తీర్చే లక్ష్మీనారాయణుడు

భక్తి

కొండాపూర్ : అతి పురాతనమైన ఆలయం కొండాపూర్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలోని లక్ష్మీనారాయణుడి దేవాలయం. ఈ ఆలయాన్ని గ్రామస్థులు ఏకమై పునర్నిర్మించారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ స్వామిని కొలిస్తే కోరిన కోర్కెలను త్వరగా నెరవేరతాయని భక్తుల నమ్మకం. లక్ష్మీనారాయణ స్వామి ఆలయం అత్యంత శ్రేష్టమైన ఆలయం. ప్రతి రోజూ ఆలయ ప్రాంగణమంతా గోవిందనామ స్మరణతో మార్మోగుతుంది. ఇటీవలే ఈ ఆలయం పునర్నిర్మాణం చేపట్టిన తర్వాత వేద బ్రాహ్మణులతో లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన అత్యంత వైభోవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి రోజూ స్వామివారికి ధూప దీప నైవేద్యం సమర్పిస్తూ ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఆలయానికి గ్రామస్థులే కాకుండా జిల్లా సరిహద్దుల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారు.



యువకుడి ఆత్మహత్య

రాయికోడ్: మండల పరిధిలోని నలంపల్లి గ్రామానికి చెందిన దూదేకుల సోఫీ(24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నలంపల్లికి చెందిన సోఫీ కుటుంబ కలహాలతో గురువారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. సోఫీ భార్య శహనాభి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆటో బోల్తా : మహిళ మృతి

- మరో నలుగురికి స్వల్ప గాయాలు
- పస్తాపూర్ శివారులో ఘటన


రత్నమ్మ మృతదేహం

జహీరాబాద్: మండలంలోని పస్తాపూర్ గ్రామ శివారులోని బైపాస్ వద్ద గురువారం రాత్రి ఆటో బోల్తాపడిన సంఘటనలో రత్నమ్మ(65) అనే మహిళ మృతిచెందిందని రూరల్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం... జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామానికి చెందిన రత్నమ్మ ఆటోలో పస్తాపూర్ నుంచి జహీరాబాద్ వైపునకు వస్తున్న క్రమంలో బైపాస్ వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. రత్నమ్మ అక్కడికక్కడే మృతిచెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అశోక్ మృతదేహం

కొండాపూర్: పెద్దాపూర్ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై ఈ నెల 1వ తేదీన జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడని ఎస్ఐ బాలస్వామి తెలిపారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం ఎన్కతల గ్రామానికి చెందిన అశోక్ ముదిరాజ్(30) ఈ నెల 1న సదాశివపేట మండలం ముబారక్‌పూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వికారాబాద్‌కు వెళ్తుండగా తోగర్‌పల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ముదిరాజ్ భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

దుబ్బాక: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురికి జైలు శిక్ష, ఒకరికి రూ. 25వందల జరిమానాను మెదక్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి విధించినట్లు గురువారం దుబ్బాక ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. గురువారం రాత్రి స్థానిక తెలంగాణ విగ్రహం వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడపటం నేరమని ఆయన అన్నారు. దీనివల్ల విలువైన ప్రాణనష్టం వాటిల్లడంతోపాటు ఎదుటివారి ప్రాణాలను హరించినవారవుతారన్నారు.

రవాణాలోనే గొర్రెల మృత్యువాత

- లారీల్లో 5 యూనిట్లకు బదులు 6 యూనిట్లను ఎక్కించిన కాంట్రాక్టర్
- తూప్రాన్‌కు వచ్చినవాటిలో 11 గొర్రెలు మృతి
- ఇన్సూరెన్స్ చేశాకే రవాణా
- జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య

తూప్రాన్: గొర్రెల రవాణాలో కాంట్రాక్టర్ కక్కుర్తికి 11 మూగజీవాలు మృతిచెందాయి. కొనుగోలు చేసి తెచ్చిన గొర్రెలు లబ్ధిదారుడికి అందకముందే మృత్యువాతపడ్డాయి. లారీలో ఐదు యూనిట్లుగా 105 గొర్రెలు ఎక్కించాల్సి ఉండగా ఆరు యూనిట్లుగా 126 గొర్రెలను ఎక్కించి పంపడంతో అవి తొక్కిసలాడి మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలు అస్వస్థతకు గురికావడంతో పశువైద్యాధికారులు వైద్యం అందించారు. ఈ సంఘటన సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

తూప్రాన్ మండలంలోని పలు గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారులకు గొర్రెల యూనిట్ల పంపిణీ కోసం తాతపాపన్‌పల్లి, ఆబోతుపల్లి, హైదర్‌గూడలలో 57 యూనిట్లు కొనుగోలుకు లబ్ధిదారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాకు తీసుకెళ్లారు. అక్కడ గుత్తి, పాపిలి, గాజులపల్లి, బేతపల్లి తదితర గ్రామాలలో గొర్రెలను లబ్ధిదారులు ఎంపిక చేసుకోగా, కొనుగోలు చేశారు. వాటిని తూప్రాన్, తాతపాపన్‌పల్లికి తరలించేందుకు రెండు లారీలు, హైదర్‌గూడ, ఆబోతుపల్లిలకు ఒక్కొక్కటి చొప్పున నాలుగు లారీలలో గొర్రెలను తీసుకొచ్చారు. ఒక్కో లారీలో ఐదు యూనిట్లుగా 105 గొర్రెలు రవాణా చేయాల్సిఉండగా, ఆరు యూనిట్లుగా 126 గొర్రెలు రవాణా చేశారు. దీంతో గొర్రెలు కిక్కిరిసి ఎక్కించడం, తొక్కిసలాటలో పలు గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. తూప్రాన్‌కు శుక్రవారం చేరే వరకే నాలుగైదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెలు కొన్ని అస్వస్థతకు గురి కావడంతో తూప్రాన్ పశువైద్యాధికారులు వైద్యం చేశారు. అయినప్పటికీ రాత్రి వరకు 11 గొర్రెలు మృతిచెందాయి. అందులో తూప్రాన్‌కు చెందిన లబ్ధిదారుడు రాజు గొర్రెలు 2, ఆంజయ్య, భాస్కర్‌లకు చెందిన గొర్రెలు ఒక్కొక్కటి మృతిచెందాయి. అలాగే తాతపాపన్‌పల్లికి చెందిన గుండస్వామి, కర్రె రమేష్‌లకు చెందిన ఒక్కొక్క గొర్రె మృతిచెందాయి. ఆబోతుపల్లికి చెందిన ఆబోతు నర్సయ్య, నడిమిల్ల నాగరాజుకు చెందిన 2 గొర్రెలు, వెంకటాయపల్లికి చెందిన సత్యనారాయణకు చెందిన ఒక గొర్రె మృతిచెందాయి. తూప్రాన్‌కు వచ్చేసరికి గొర్రెలు మృతిచెందడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు.


లారీలో తొక్కిసలాటలో మృతిచెందిన గొర్రెలు

ఇన్సూరెన్స్ చేశాకే రవాణా

– జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య

ఈ పథకం కింద కొనుగోలు చేసిన గొర్రెలను ఇన్సూరెన్స్ చేశాకే తీసుకువస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య తెలిపారు. మృతిచెందిన గొర్రెలకు ఇన్స్‌రెన్సూ వస్తుందని, రూ.5వేలు చెల్లిస్తామన్నారు. లారీల్లో వత్తిడి ఎక్కువై అవి మృతిచెందినట్లు ఆయన పేర్కొన్నారు. గొర్రెలు చనిపోవడంపై వివరాలు సేకరిస్తామని వెంకటయ్య తెలిపారు.

అమ్మకానికి సిద్ధంగా 'రాజీవ్ స్వగృహ'


10న వెబ్‌సైట్ ప్రారంభం
ఆ వెంటనే బుకింగ్ ప్రక్రియ షురూ
రూ.10 వేలు చెల్లిస్తే ఫ్లాట్ రిజర్వు
15 రోజుల్లోగా ఫ్లాటు విలువలో 25% కట్టాలి

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల అమ్మకానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఈ నెల 10వ తేదీన సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను ఆన్‌లైన్‌లో ఓపెన్ బుకింగ్ ద్వారా విక్రయించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన విషయం విదితమే. తొలిదశలో భాగంగా బండ్లగూడ 2,245, పోచారంలో 1,474 ఫ్లాట్లను విక్రయించనున్నారు. బండ్లగూడలోని ఫ్లాట్లలో నిర్మాణం పూర్తైన వాటికి చదరపుటడుగుకు రూ. 1,900 చొప్పున, సెమీ ఫినిష్డ్ ఫ్లాట్లను రూ. 1,700 చొప్పున, 'రాజీవ్ స్వగృహ' పోచారంలోని ఫ్లాట్లను చదరపుటడుగుకు రూ. 1,700, సెమీ ఫినిష్డ్ ఫ్లాట్లను రూ. 1,500 చొప్పున విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక 10వ తేదీనుంచి ఫ్లాట్ల బుకింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఫ్లాట్లను బుక్ చేసుకునే ఉద్యోగులు ముందుగా రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆ ఫ్లాట్ సంబంధిత ఉద్యోగి పేరుమీద రిజర్వ్ అవుతుంది. తర్వాత ఆ ఫ్లాటు విలువలో 25 శాతాన్ని 15 రోజుల్లోగా, 50 శాతాన్ని నెల రోజుల్లోగా, మిగిలిన 25 శాతాన్ని రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇక వాహన పార్కింగ్ స్థలం కోసం అదనంగా చెల్లించాలి. ఏ స్థాయి ఉద్యోగి అయినా కూడా ఫ్లాట్లను కొనుగోలు చేయొచ్చు. '010' పద్దు ద్వారా వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు మాత్రం రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను కొనుగోలు చేసేందుకు అవకాశం లేదు. కాగా వార్షికాదాయం రూ. 6 లక్షల లోపు ఉన్న ఉద్యోగులు.. 600 చదరపుటడుగుల ఫ్లాట్లను కొనుగోలు చేయాలనుకుంటే.. వారికి వడ్డీ లేని రుణం అందుతుంది. ఈ వడ్డీని కేంద్రం భరిస్తుంది. రుణం కింద... ఉద్యోగికి అతని 60 నెలల మూల వేతనానికి సరిపోను మొత్తాన్ని బ్యాంకులు అందిస్తాయి. రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బును టీఎస్ఆర్ఎస్‌సీ అప్పులను ప్రభుత్వం తీర్చనుంది.

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

తూప్రాన్: మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మెదక్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి అన్నపూర్ణ శుక్రవారం తీర్పు చెప్పారని తూప్రాన్ ఎస్ఐ పరశురాం తెలిపారు. తూప్రాన్ పట్టణంలోని ర్వహించిన డ్రింక్ అండ్ డ్రైవ్‌లో మనోహరాబాద్‌కు చెందిన బోసిక నాగేష్ పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. అతడిని మెదక్ మొబైల్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అన్నపూర్ణ ఏడు రోజుల జైలుశిక్ష, రూ. 1000 జరిమానా విధించారని ఎస్ఐ పరశురాం పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

కూకట్‌పల్లి: డబ్బు సంపాదించి ఇంటికి పంపించ లేకపోతున్నానని మనస్తాపం చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఓ మూడంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డి జిల్లా మానూరు మండలం మైకోడు గ్రామానికి చెందిన కమ్మరి సంగన్న కుమారుడు రాజేష్‌చారి అలియాస్ రాజు(21) కూకట్‌పల్లి భాగ్యనగర్‌కాలనీలోని సాయినాథ్ టీ స్టాల్‌లో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. కౌంటర్లో కూర్చుని లావాదేవీలు నిర్వహించేవాడు. నగదు లావాదేవీల్లో తేడా రావడంతో తన డబ్బు కట్టేవాడు. దీంతో సంపాదించిన సొమ్మును ఇంటికి పంపించలేకపోతున్నానని బాధపడుతుండేవాడు. గురువారం కూడా నగదు లావాదేవీల్లో తేడా రావడంతో టీ స్టాల్ యజమాని మందలించాడు. రాజు.. తమ్ముడు సతీష్‌కు విషయం చెప్పి బాధపడ్డాడు. టీస్టాల్ మూసిన తర్వాత రాజు తాగిన మత్తులో షాపు ఉన్న భవనం మూడో అంతస్తు పైకెక్కి కిందకు రాలేదు. సతీష్ కొద్దిసేపటి తర్వాత భవనం పైకెళ్లి చూడగా రాజు కనిపించకపోవడంతో ఇంటికెళ్లిపోయాడు. మృతదేహం శుక్రవారం భవనం వెనుకవైపు కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాజు గురువారం రాత్రే ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ నారాయణసింగ్ తెలిపారు.

వడ్డేపల్లి రైస్‌మిల్‌లో విజిలెన్స్ తనిఖీలు

గజ్వేల్‌అర్బన్/రాయపోల్: రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని రైస్‌మిల్‌లో విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో ఆ శాఖ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి 49 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 82 క్వింటాళ్ల నూకలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.80లక్షలు ఉంటుందన్నారు.

డ్రైవర్ అజాగ్రత్తతో కార్మికుడి మృతి?

- పీఆర్‌జీ కంపెనీ ఎదుట కార్మికుల ధర్నా

చిన్నకోడూరు: చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామ శివారులోని పీఆర్‌జీ కంపెనీలో పని చేస్తున్న అబ్దుల్ అన్సారి అనే కార్మికుడిని శుక్రవారం టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి ఢీకొట్టడంతో మృతిచెందాడు. డ్రైవర్ నిర్లక్షమే అన్సారి మరణానికి కారణమని ఇరిగేషన్ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, వ్యవస్థాపక అధ్యక్షుడు కేసరి ప్రభాకర్ ఆరోపించారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌జీ కంపెనీ ఎదుట వారి అధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. అన్సారి నిద్రపోతున్న సమయంలో డ్రైవర్ అజాగ్రత్తగా టిప్పర్‌ను నడిపి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. అన్సారి కుటుంబానికి 20 లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.


కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ముళ్లకిరీటంగా మారిన మెదక్ ఎంఈవో పోస్టు

- బాధ్యతలు స్వీకరించేందుకు హెచ్‌ఎంల విముఖత
- వివాదాస్పదంగా మారుతున్న మెదక్ విద్యాధికారి స్థానం

మెదక్ రూరల్: మెదక్ మండల విద్యాధికారి స్థానమే వివాదాస్పదంగా మారుతోంది. ఇక్కడ బాధ్యతలు స్వీకరించి విధులు నిర్వర్తించిన ఇద్దరు ఎంఈవోలు సస్పెన్షన్‌కు గురికావడం, మరొకరు వివాదాలతో పదవీ విరమణ పొందడంతో ఆ స్థానమంటే అందరూ భయపడుతున్నారు. ఇటీవల నరేశ్ సస్పెన్షన్‌తో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయడానికి విద్యాశాఖ నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.సీనియారిటీ ఉన్న వారు సెలవుల్లో వెళ్లడానికి సిద్దపడుతున్నారే తప్ప ఎంఈవో పోస్టు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో ఎవరిని భర్తీ చేయాలనే సంశయంలో విద్యాశాఖ ఉంది.

మెదక్ మండల విద్యాధికారి పోస్టు ఆది నుంచి వివాదాస్పదంగానే మారుతుంది. జిల్లాలోనే అత్యధికంగా స్కూళ్లు కలిగిన మండలం కావడంతో అధికారుల పర్యవేక్షణ లేక గందరగోళంగా మారడం వల్ల బాధ్యతలు నిర్వహించే వారు విజయవంతం కాలేకపోతున్నారు.జిల్లాలోని అత్యధిక స్కూల్ ఉన్న మండలం కావడంతో బాధ్యతలు స్వీకరించే విద్యాధికారులకు భారంగా మారుతుంది.



ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి పోస్టు

వివాదాస్పదంగా మారిన ఎంఈవోల సస్పెన్షన్

మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన వారిలో ఇద్దరు సస్పెన్షన్‌కు గురికావడంతో మెదక్ ఎంఈవో స్థానం అంటేనే భయ పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఇక్కడ ప్రతాప్‌గౌడ్ ఆర్‌వీఎం నుంచి ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించాడు. ఆయన బదిలీపై వెళ్లడంతో పాపన్నపేట మండల ఎంఈవో నర్సింహాచారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన పదవీ కాలంలో విద్యావలంటీర్ల వేతనాలు కాజేసాడన్న ఆరోపణలతో పాటు పలువురు ఫిర్యాదు మేరకు సస్పెన్షన్ ఎదుర్కోవాల్సి వచ్చింది. మళ్లీ బాధ్యతలు స్వీకరించిన ఆయన కొని నెలల పాటు మెదక్ ఎంఈవోగా కొనసాగి పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత రామాగౌడ్ కొన్నాళ్లు ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించిన ఆయన రిటైర్డ్ కావడంతో రంగచారి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించి ఆయన పదవీ విరమణ పొందారు. మక్తభూపత్‌పూర్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ ఆర్‌వీఎం ద్వారా మంజూరైన నిధుల్లో పనులు జరగకుండానే డబ్బులు మంజూరు చేశారన్న ఆరోపణలు సస్పెన్షన్‌కు గురయ్యాడు. హవేళీఘణపూర్ హెచ్‌ఎం సాయిబాబకు ఎంఈవోగా కొనసాగాడు. ఆయన పదవీ విరమణ పొందడంతో ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టును రాజ్‌పల్లి హెచ్‌ఎం శ్రీనివాస్ కొన్ని నెలల పాటు ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. తనవల్ల కాదంటూ విద్యాశాఖకు లేఖ రాయడంతో సీనియారిటి కలిగిన మరో ఇద్దరి హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగించేందుకు చూసినా వారు ముందుకు రాలేదు.

సుదర్శన్‌మూర్తి బాధ్యతలు తీసుకుంటారా..?

మెదక్ మండలంలోని సీనియారిటీ కలిగిన హెచ్‌ఎంలు మెదక్ మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకు రావడం లేదు. కొల్చారం, పాపన్నపేట మండలాల ఎంఈవోలు కూడా అదనపు బాధ్యతలు స్వీకరించేందుకు అంగీకరించడం లేదు. ఇక మొదటి నుంచి బాధ్యతలు స్వీకరించేందుకు ఆసక్తి చూపని సర్దన హెచ్‌ఎం సుదర్శన్‌మూర్తికే అప్పగించే అవకాశాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. ఆయన కూడా అంగీకరించకుంటే విద్యాధికారి కోసం మరికొన్ని రోజులు ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నాయి.

భారతీయ పండుగలు సంస్కృతికి ప్రతీకలు

- జిల్లా విద్యాశాఖాధికారి సరోజినీదేవి

మెదక్ అర్బన్: సిరిసంపదలు, సుఖ శాంతులకు ప్రతీకగా హిందువులు పూజించే దేవత వరలక్ష్మి మాత అని జిల్లా విద్యాశాఖాధికారి సరోజినిదేవి పేర్కొన్నారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల, వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జీకేఆర్ గార్డెన్‌లో చేపట్టిన సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. ఈ మాసంలో వరలక్ష్మి వ్రతాలు జరుపుకోవడం వల్ల నిండు ముత్తైదువలుగా జీవిస్తారని ప్రతీతి. మహిళల సౌభాగ్యం కోసమే సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మహిళలు కలిసి వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యమత్యం, సద్భావన, సహకారం, స్నేహభావం, ఆత్మీయతా అనురాగాలు పెంపొందుతాయన్నారు. మహిళల సౌభాగ్యం కోసమే సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేపడితే ఆ తల్లి కరుణా కటాక్షాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, వాసవి, వనితా క్లబ్ అధ్యక్షులు గంజి శ్రీనివాస్, రాగి వనజ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచరణ్ , ఆచార్యులు సుధ, సద్గుణ, రమేశ్, నాయుడు, నర్సింగ్‌రావు, వాసవి, వనితా క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

మెదక్ అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్‌జీవో భవనంలో ఎస్టీయూ 70 వసంతాల ఉద్యమోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. హెల్త్ కార్డులు, పీఆర్సీ బకాయిలు చెల్లింపులకు ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఉపాధ్యాయులు సమిష్టి కృషితో ముందుకెళ్లాలన్నారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు భుజంగరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. 70 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ప్రణీద్‌కుమార్, అసోసియెట్ అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు, రవి, పోచయ్య, కిష్టయ్య, దేవదాసు, సిద్దిరాములు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం 8న ధర్నా

సీపీఎస్‌ను రద్దు చేస్తూ పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముత్యాలు, సంగయ్య పేర్కొన్నారు.

రిజర్వేషన్ కోసం రేపు చలో ఢిల్లీ

మెదక్ అర్బన్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చలో ఢిలీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మెదక్ డివిజన్ అధ్యక్షులు జంగిటి రాములు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గుల్షన్‌క్లబ్‌లో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజు, మాణిక్యం, రాజు, జంగంశ్రీను, దశరథ్, గోవింద్, రవి, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపాలని ఏబీవీపీ విద్యార్థుల ధర్నా

మెదక్ అర్బన్: మెదక్ నుంచి వెల్దుర్తి అదనపు బస్సులు నడపాలంటూ పాత బస్టాండ్ ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. విద్యనభ్యసించడానికి వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు పట్టణానికి వస్తున్నారని, తిరగి వెళ్లేందుకు సరైన బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ నాయకులు వాపోయారు. వెంటనే అదనపు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించి ధర్నాను విరమింపజేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

చౌట్లపల్లి గ్రామ పంచాయతీ ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానం

హవేళీఘణపూర్: శుక్రవారం మండల పరిధి పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక సమావేశమై శుక్లాల్‌పేట, చౌట్లపల్లి గ్రామాలను కలిపి ప్రత్యేక చౌట్లపల్లి గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించడం, ఆమోదించడం జరిగిందని సర్పంచ్ సునితాసాయిలు తెలిపారు.

సోలార్‌ప్లాంట్లపై విచారణ జరిపిస్తాం

- జిల్లా జాయింట్ కలెక్టర్ సురేష్‌బాబు

టేక్మాల్: టేక్మాల్ మండలంలో నిర్మిస్తున్న సోలార్‌ప్లాంట్లలో ప్రభుత్వ భూములు ఉంటే విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం టేక్మాల్ మండలంలోని ఎలకుర్తిలో ఎస్సీలకు సంబంధించి భూముల పరిశీలన చేసిన అనంతరం కాదూ్లర్ శివారులోని మల్లన్న గట్టువద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైతే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదన్నారు. నాలా పర్మిషన్ కోసం దరఖాస్తు చేయడం జరిగిందని, అది రాగానే పూర్తిస్థాయి విచారణ జరిపి సోలార్‌భూముల్లో ప్రభుత్వ భూములు ఉంటే చర్యలు తప్పవన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణ రాష్ట్రం ఎంతోప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని మెదక్ జేసీ సురేష్‌బాబు పిలుపునిచ్చారు. కాదూ్లర్ గ్రామ శివారులో శుక్రవారం



మొక్కను నాటుతున్న జేసీ, ఆర్డీవో

మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల రక్షణ అందరి బాధ్యత అన్నారు. మెదక్ జిల్లాలో కోటి 40లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారని, ప్రణాళిక ప్రకారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పయనిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట మెదక్ ఆర్డీవో నగేష్, తహసీల్దార్ ముజ్ఫర్ హుస్సెన్, ఎంపీడీవో విష్ణువర్దన్, కాదూ్లర్ గ్రామ సర్పంచ్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పది మలేరియా కేసులు నమోదు

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

వెల్దుర్తి: జిల్లాలో పది మలేరియా కేసులు నమోదయ్యాయని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి మండలం అచ్చంపేటలో పలువురు జ్వరాల భారిన పడ్డారని తెలుసుకున్న ఆయన గ్రామంలోని ఎస్సీ కాలనీని పరిశీలించారు. పారిశుధ్య నిర్మూలన పాటించకుంటే ప్రజలు రోగాల బారిన పడుతారని తెలిపారు. వర్షాకాలం అయినందున కనీసం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అచ్చంపేటలో 7 మంది జ్వరాల భారిన పడ్డారని తమకు సమాచారం రాగా అందులో ఒకరికి మాత్రమే తీవ్రంగా జ్వరం ఉన్నట్లు గుర్తించామన్నారు. అయినప్పటికీ అందరి రక్తనమూనాలను సేకరించామని తెలిపారు. ఎస్సీ కాలనీలో తాగునీటి పైపుల లీకేజీ, పారిశుధ్య పనులు లోపించాయని,



అచ్చంపేటలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

వాటిని నిర్మూలించాలని తెలిపారు. పంచాయతీ వారికి పారిశుధ్య నిర్మూలన కోసం మందులు చల్లేందుకు తామే మందులను పంపిణీ చేస్తామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే అంటు వ్యాధులు సోకుతాయని తెలిపారు. జిల్లాలో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 పీహెచ్‌సీ, ఒక ఏరియా ఆస్పత్రి ఉన్నట్లు తెలిపారు. నాలుగు డాక్టర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, అందులో రామాయంపేట 2, తూప్రాన్1, సర్దన 1 అని తెలిపారు. మెరుగైన వైద్యం అందించేందుకు మెదక్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. తట్టు వ్యాధి నివారణకు 9-15 ఏళ్ల చిన్నారులకు ఈ నెల 15 వరకు వ్యాక్సిన్‌ను వేస్తామని తెలిపారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి కుమార్ స్వామి, వైద్యులు ఉదయ్, శైలజతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పది వేలిస్తేనే పౌతీ మార్పిడి!

- భార్య పుస్తెలమ్మి వీఆర్వోకు లంచమిచ్చిన రైతు
- ఏడాది గడుస్తున్నా అందని పట్టాదారు పాసు పుస్తకాలు
- న్యాయం చేయండని గోడు వెళ్లబోసుకున్న మల్లయ్య


బాధిత రైతు

కౌడిపల్లి: అన్ని శాఖల్లో అవినీతిని రూపుమాపాలని ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికార పీఠం చేపట్టినప్పటి నుంచి కచ్చితమైన ఆదే శాలు జారీ చేశారు. ప్రధానంగా నిరుపేద రైతులకు నయాపైసా ఆశించ కుండా ఇంటి ముంగిటనే రెవెన్యూ సేవలందించాలన్న అధికార యంత్రాం గం మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. వీటన్నింటికి భిన్నంగా రెవెన్యూ అధికారులు అవినీతి అక్రమాలకు కాలు దువ్వుతున్నారనడానికి మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కుకుట్లపల్లి వీఆర్వో సోమరాజు పౌతీ మార్పిడి కోసం నిరుపేద రైతు గొల్ల మల్లయ్య వద్ద రూ. 10 వేలు తీసుకున్న సంఘటన నిదర్శనంగా చెప్పవచ్చు. శుక్రవారం కుకుట్ల పల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు గొల్ల మల్లయ్య తనకు జరిగిన అన్యాయం గురించి 'ఆంధ్రజ్యోతి'తో గోడు వెల్లబోసుకున్నాడు. వంశపారం పర్యంగా తాతల కాలంనుంచి తన తండ్రి స్వర్గీయ గొల్ల ఆగమయ్య పేరున సర్వే నంబరు 10, 83, 153, 190, 269, 127/2, 177/అ, 178లో ఉన్న రెండెకరాల భూమిని పౌతి మార్పిడి చేయాలని గ్రామ వీఆర్వో సోమరాజుకు ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. తన తండ్రి మరణా నంతరం రక్త సంబంధీకులయిన గొల్ల మల్లయ్య, తమ్ముడు దుర్గయ్య పేరున 2 ఎకరాల భూమిని సమాన భాగాలుగా పంచుకున్నారు. పౌతి మార్పిడి చేయాలని ఏడాది క్రితం వీఆర్వోకు దరఖాస్తు చేసుకోవడంతో రూ.10వేలిస్తేనే మార్పిడి చేయిస్తానన్నాడు. నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగి పదివేలిచ్చినప్పటికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వలేదు. ఇటీవల మరోసారి ఆర్డీవో సంతకాల కోసం మరో రూ.వెయ్యి ఖర్చవుతుందనడంతో బాధితుడు ఇచ్చాడు. అయినా ఆర్డీవో సంతకాలు చేయించకుండానే పాసు పుస్తకాలిచ్చాడని రైతు గొల్ల మల్లయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. వీఆర్వోకు భార్య పుస్తెలతాడు అమ్మివేశానని చెప్పాడు. పట్టాదారు పుస్తకాలందించకపోవడంతో బ్యాంకుల్లో రుణాలు లభించక అప్పుల వారికి ముఖం చూపించక గ్రామాన్ని వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని రైతు తెలిపాడు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రైతు గొల్ల మల్లయ్య కోరాడు.

చర్యలు తీసుకుంటాం - శ్రీశైలం, ఇన్‌చార్జి తహసీల్దార్

పౌతి మార్పిడి పేరుతో పదివేల రూపాయలు తీసుకున్న కుకుట్లపల్లి వీఆర్వో సోమరాజుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. నయాపైసా తీసు కోవాల్సిన అవసరం లేదు. బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తా.

మైనింగ్ అక్రమాలకు చెక్

- శాటిలైట్ ద్వారా రిమోట్ సెన్సింగ్
- రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా మెదక్ జిల్లా ఎంపిక
- శిక్షణకు గుజరాత్ తరలివెళ్లిన అధికారులు

మెదక్: ప్రభుత్వం మైనింగ్ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆధునిక విధానాలను ప్రవేశపెట్టనుంది. గుజరాత్‌లోని రిమోట్ సెన్సింగ్ అండ్ కమ్యూనికేషన్ సెంటర్ (రెసికో)లో గత నెల 31 నుంచి 4వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ పొందడానికి అధికారులు తరలివెళ్లారు. ఇందుకోసం మెదక్ జిల్లాను రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అంతరిక్షంలో శాటిలైట్ ద్వారా ప్రభుత్వం అనుమతించిన గనుల తవ్వకాలను అనాధికారికంగా విస్తరించే చర్యలను మైనింగ్ శాఖ వెంటనే శాటిలైట్ ద్వారా పసిగడుతుంది. దీంతో మైనింగ్ అక్రమాలకు చాలా వరకు నిరోధించవచ్చునని మైనింగ్ అధికారులు తెలిపారు. కార్యక్రమానికి జాయింట్ డైరెక్టర్ రఫీక్, జిల్లా గనుల శాఖ అధికారి జయరాజ్ శిక్షణలో పాల్గొన్నారు. జయరాజ్ మాట్లాడుతూ.. ఇక నుంచి ఆధునిక విధానాలతో గనుల తవ్వకాల్లో జరుగుతున్న అవకతవకలను వెంటనే పసిగడుతామని తెలిపారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా మెదక్ జిల్లాలో అమలవుతున్న ఈ విధానం రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతుందని వివరించారు.

'టెట్'లో ప్రతిభచూపిన విద్యార్థి

- 'టెట్' పేపర్-1లో 61.93 శాతం • 2లో 18.60 శాతం ఉత్తీర్ణత
- 120 మార్కులు సాధించిన కుర్మ నవీన్



మెదక్ అర్బన్/పాపన్నపేట: శుక్రవారం విడుదలైన టెట్ ఫలితాల్లో పేపర్-1 లో 61.93 శాతం, పేపర్-2లో 18.60 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. జూలై 24న నిర్వహించిన అర్హత పరీక్షలో పేపర్-1 లో 2,732 మంది అభ్యర్థులు రాయగా 1692 మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2లో 3,624 మంది రాయగా 674 మంది అర్హత సాధించారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్షలో పాపన్నపేట మండల పరిధిలోని ముద్దాపూర్ గ్రామానికి చెందిన కుర్మ నవీన్ ప్రతిభ కనబర్చాడు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో 150 మార్కులకు 120 మార్కులు సాధించాడు.

నత్తనడకన 'డబుల్‌బెడ్రూం'

- జిల్లాలో నిదానంగా జరుగుతున్న పనులు
- మూడు నియోజకవర్గాల్లో ఇంకా పడని పునాది రాయి
- సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే రెండు చోట్ల గృహ ప్రవేశాలు
- రాయితీలిస్తున్నా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- చాలా చోట్ల స్థలాలు దొరక్క ఇబ్బందులు
- ఇకనైనా వేగం పుంజుకుంటేనే ఫలితం

ఆంధ్రజ్యోతి, మెదక్: జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇళ్ల నిర్మాణాల పనులు చాలా చోట్ల కాగితాలకే పరిమితమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లోపు నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉండగా.. గిట్టుబాటు కావడం లేదంటూ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం శాపంగా మారుతోంది. రాయితీపై సామగ్రి ఇస్తున్నా ఆశించిన రీతిలో స్పందన లేదు. పొరుగున ఉన్న జిల్లాల్లో ప్రజాప్రతినిధుల చొరవతో చకచకా నిర్మాణాలు పూర్తయి ఎంచక్కా గృహప్రవేశాలు జరిగిపోతున్నాయి. మనకాయోగం ఎప్పుడా అంటూ జిల్లా జనం నిట్టూరుస్తున్నారు.

మంజూరు 4,121..

నిర్మాణంలో ఉన్నవి 525 మాత్రమే

గూడు లేని బీదాబిక్కీ ప్రజల కోసం ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. గత ప్రభుత్వాల హయాంలో నిర్దేశించిన మేర నగదు సహాయాన్ని ఇవ్వగా మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులే భరించే వారు. దీంతో ఇళ్లు నిర్మించుకున్న వారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ దుస్థితి నుంచి రక్షించి వారిపై నయాపైసా భారం పడకుండా సొంతింటి కలను నిజం చేయడమే ఈ పథకం ఉద్దేశం. ప్రజల నుంచి కూడా ఈ పథకానికి మంచి స్పందన వచ్చింది. పథకం ప్రచారంపై కనిపించిన శ్రద్ధ పనులపై ఉండటం లేదు. ఫలితంగా చాలా చోట్ల ఇంకా స్థలాలే ఖరారు కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.5.04లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.5.40 లక్షలు వెచ్చిస్తున్నారు. జిల్లాకు రెండు విడతల్లో కలిపి ఇప్పటివరకు 4,121 ఇళ్లు మంజూరుకాగా కేవలం 525 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే వివిధ దశల్లో ఉన్నాయి. మిగితావి ఇంకా ప్రారంభమే కాలేదు. మెదక్ నియోజకవర్గానికి 1,660 ఇళ్లు మంజూరవగా 300 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో 1,295కుగాను 95, దుబ్బాక నియోజకవర్గంలో (చేగుంట, నార్సింగి మాత్రమే) 365లో 130 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అందోల్, నారాయణఖేడ్, సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాల కోసం పునాది రాయి వేయలేదు. స్థలాలు దొరక్క పోవడం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం పథకానికి ప్రతిబంధకంగా మారాయి. ఇళ్ల నిర్మాణాల కోసం అనువైన స్థలాలను సేకరించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని చోట్ల ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమి కొనుగోలు చేస్తూ పనులను చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు 4,121 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా.. వాటిలో 3,379 ఇళ్ల నిర్మాణం కోసం 60 చోట్ల స్థలాల ఎంపిక పూర్తయింది. ఇందులో 1,275 ఇళ్ల నిర్మాణం కోసం 15 చోట్ల లే అవుట్‌లు సిద్ధమయ్యాయి. వాటిలో 590 ఇళ్లకు సంబంధించిన టెండర్లు పూర్తి కాగా.. 525 నిర్మాణాల పనులు ప్రారంభమయ్యాయి.

ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణం కోసం చెల్లిస్తున్న రూ.5.04 లక్షలు తమకు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇందులోంచి పన్నులు పోగా మిగిలేది రూ.4.6 లక్షలు మాత్రమే. ఈ మొత్తంలో ప్రభుత్వం రూపొందించిన ప్లాన్ మేరకు 125 గజాల్లో ఇల్లు నిర్మించాలంటే అదనంగా రూ.లక్ష వరకు తమపై భారం పడుతుందని కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో వారి వెసులుబాటు కోసం ప్రభుత్వం పలు రాయితీలను ప్రకటించింది. రాయితీపై సిమెంట్ ఇవ్వడం, ఇసుకకు సీనరేజీ చార్జీలు లేకుండా అనుమతులివ్వడం, కంకర క్రషర్ యజమాన్యాలతో మాట్లాడి తక్కువ ధరలో కంకర వచ్చేలా చూస్తామని, ఇనుము కూడా తక్కువ ధరలో అందేలా ప్రయత్నిస్తామని చెబుతూ స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు కాంట్రాక్టర్లను బుజ్జగిస్తూ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఇది కొంత వరకు పనిచేసింది. డిప్యూటీస్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి చొరవతో మెదక్ సమీపంలో, దుబ్బాక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో చేగుంట మండలంలో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్లా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

జిల్లాలో ఇళ్ల పరిస్థితి

ని.	మం.	టెం.	ప్రా.	పూ.
మెదక్	1,660	300	300	0
నర్సాపూర్	1,295	160	95	0
దుబ్బాక	365	130	130	0
అందోలు	200	0	0	0
నారాయణఖేడ్	315	0	0	0
గజ్వేల్	286	0	0	0

నియోజకవర్గం.. మంజూరైనవి.. టెండర్ అయినవి.. ప్రారంభమైనవి.. పూర్తయినవి

పొరుగు జిల్లాలో చక చకా!

మన జిల్లాతో పోలిస్తే.. కాదు కాదు.. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా ముందంజలో ఉంది. సీఎం, మంత్రి జిల్లా కావడంతో అధికారులు నయానో భయానో కాంట్రాక్టర్లచే పనులు సకాలంలో జరిగేలా చూస్తున్నారు. ఇప్పటికే ఎర్రవల్లి, నరసన్నపేటల్లో 456 ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గతేడాది డిసెంబర్‌లో గృహ ప్రవేశాలు కూడా పూర్తయ్యాయి. తాజాగా శుక్రవారం సిద్దిపేట మండలం మందపల్లి మధిర పిట్టలవాడలో 20 ఇళ్లను మంత్రులు ప్రారంభించారు. వచ్చే దసరాకు మరిన్ని అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. కాని మన జిలాలో ఈ యేడాదిలో ఎక్కడా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. అయితే వచ్చే ఎన్నికలకైనా కొన్నిచోట్ల పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేసే ఉద్దేశంలో ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఇప్పటికే మెదక్, నర్సాపూర్, దుబ్బాక నియోజకవర్గాల ఎమ్మెల్యేలు డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం పనులు పుంజుకునేలా ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు. విఘ్నాలు లేకుండా 'డబుల్'వేగంతో సకాలంలో నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వస్తే నిజంగా ఆ రోజు పేదలకు పండగే..

'ఖేడ్' రైతుల్లో ఆందోళన

- పంటలు ఎదుగుతున్న దశలో వానలు కరువు
- డివిజన్‌లో అధికశాతం వర్షాధార పంటలే
- మరో రెండ్రోజుల్లో వర్షాలు కురియకపోతే భారీ నష్టం

నారాయణఖేడ్: మొక్కలు ఎదుగుతున్న దశలో వర్షాలు కనుమరు గవడంతో ఖేడ్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురియడంతో వారు ఆనందపడినా, విత్తనం వేసిన తరవాఆత వరుణడు ముఖం చాటేశాడు. మరోవైపు ఎండలు ఎండాకాలాన్ని తలపిం చేలా మండుతున్నాయి. దీంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పంటలను ఎలా రక్షించుకోవాలో అంతుపట్టడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సాగు నీటి వనరులు అంతంత


గుండ్లమాచునూర్‌లో ఎండుతున్న వరి నారు

మాత్రమే. అధికశాతం రైతులు వర్షాధార పంట లనే సాగు చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వ సూచనతో రైతులు అధికంగా పెసర, కంది, మినుము పంటలను సాగు చేశారు. అయితే వాటికి ధరలు రాక ఇబ్బంది పడ్డారు. అందుకే ఈసారి వాణిజ్య పంటలు పత్తి, సోయా బీన్ అధికంగా సాగు చేశారు. డివిజన్‌లో వరి 2,088 హెక్టార్లలో సాగవగా, జొన్న 1,996 హెక్టార్లలో సాగయింది. మొక్కజొన్నను 3,952హెక్టార్లలో, పెసర్లను 7,770, మినుమును 4,709, కంది 7,398 హెక్టార్లలో, సోయా 5,901, పత్తి 13,856, చెరకు 1,258 హెక్టార్లలో సాగయింది. జూన్‌లో సాధా రణ వర్షం కంటే అధికంగా కురిసింది. జూలైలో సాధారణ వర్షపాతం 90 మి.మీ, కాగా 10 రోజులుగా వర్షం జాడనే లేదు. ఆరు మండలాల్లో సాగయిన ప్రధాన పంటల్లో 20శాతం వాడుముఖం పట్టాయి. వర్షాలు లేకపోవడంతో నారాయణఖేడ్ మండలం చాప్టా(కె), వెంకటాపూర్, ర్యాల మడుగు, బంద్రాన్‌పల్లి, అనంత్‌సాగర్ పంటలు ఎండుతున్నాయి. ఇప్పటి వరకు పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఏదేమైనా మరో రెండ్రోజుల్లో వర్షాలు కురియకుంటే ఖరీఫ్ పంటలకు భారీగా నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కంగ్టిలో పెసర పంట ఎండుతున్న దృశ్యం

హత్నూరలో...

హత్నూర: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురియక రైతన్న ఆందోళనకు గురవుతున్నాడు. కొండంత ఆశతో రైతులు వరినాట్లు వేశారు. అప్పటినుంచి వరుణుడు ముఖం చాటేయడంతో నారుమడ్లకు నీరు అందక ఎండుముఖం పట్టాయి. అప్పులు చేసి వేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే చేసేదేమి లేక రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. మండలంలో వరి 2,800 ఎకరాలు, పత్తి 6,400 ఎకరాలు, మొక్కజొన్న 650 ఎకరాలు, కంది 300 ఎకరాలు, పెసర 300 ఎకరాలు, మినుము 300 ఎకరాల్లో సాగుచేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

సినిమాలు

నర్సాపూర్	
సాయి	ఫిదా
శ్రీనివాస	గౌతమ్‌నంద
రామాయంపేట	
సంతోష్	నక్షత్రం
సాయిరామ్	ఫిదా
పెద్దశంకరంపేట	
లక్ష్మి	బాహుబలి-2
మెదక్	
సినీమ్యాక్స్	ఫిదా
గంగినేని	గౌతమ్‌నంద
సాగర్	నక్షత్రం

అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు

- రామాయంపేట-సిద్దిపేట రహదారిపై అడుగడుగునా...
- అవసరం లేనిచోట ఏర్పాటు
- అవస్థలు పడుతున్న వాహనదారులు

రామాయంపేట: వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే రామాయంపేట - సిద్దిపేట రహదారి అది. దీనిమీదుగా గుంటూరు, విజయవాడ, వైజాగ్, వరంగల్, కరీంనగర్ వెళ్తూ అంతరాష్ట్ర రహదారిగా పేరొందింది. ఈ మార్గం నిమిషం తీరిక లేకుండా వాహనాలు తిరుగుతుంటాయి. అంతటి రద్దీ రహదారిపై ఇష్టానుసారంగా గ్రామస్థులు అడుగడుగునా స్పీడ్‌బ్రేకర్లు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామాల రోడ్లపై ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో.. కోపోద్రిక్తులై అప్పటికపుడే వీటిని నిర్మిస్తూండడం.. వాహనదారుల సమయమూ, పెట్రోల్ వృథా అవుతోంది. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు అడ్డుచెప్పినా ప్రజలు వినడంలేదు. దీనివల్ల ఈ మార్గం గుండా రాకపోకలు సాగించడం నరకప్రాయమైంది. ఇక్కడి నుంచి సిద్దిపేటకు 47కిలోమీటర్లు కాగా 16గ్రామాలు.. 47 స్పీడ్ బ్రేకర్లుండడం వల్ల ప్రయాణ సమయం పెరుగుతోంది. దీనివల్ల వాహన చోదకులు ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే విసిగిపోతున్నారు. 20ఏళ్ల కిందట సింగిల్ రోడ్డు ఉన్నా ఒక గంట సమయం పట్టేది. దశాబ్దం కిందట రహదారి విస్తరణలో డబుల్ రోడ్డుగా మారినా ప్రయోజనం లేకపోయింది. ఇందుకు ప్రధాన కారణం స్పీడ్‌బ్రేకర్ల వల్లే అని చెప్పవచ్చు. చిన్నచిన్న గ్రామాలపైన చౌరస్తాలపైన ఇవి ఏర్పాటు కావడమే. ఈ పరిస్థితులతో అవస్థలు పడాల్సి వస్తోంది. వాహన స్పీడు అలా పెంచామో లేదో.. ఆ వెంటనే స్పీడ్‌బ్రేకర్ దృష్ట్యా గేరుమార్చక తప్పడం లేదు.

అంతేకాదు ఈ రోడ్డు మీదుగా కొత్తగా ప్రయాణించేవారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. లెక్కచూస్తే కిలోమీటరుకు ఒకటి వంతున ఉండడంతో దీనిపై ప్రయా ణంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. ఈ స్పీడ్‌బ్రేకర్లతో ద్విచక్ర వాహనాల వారైతే వెన్నుపూస బాధలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇక పెద్ద వాహనదారులైతే అతి జాగ్రత్తగా వ్యవహరించాల్సిందే. లేదంటే టైర్లుపాడై ఎక్సల్ విరిగే అవకాశాలున్నాయి. ఇకనైనా రోడ్లు భవనాల శాఖాధికారులు స్పీడ్‌బ్రేకర్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై వేసిన స్పీడ్‌బ్రేకర్లు



రోడ్డుపై విద్యార్థుల నిరసన

వర్గీకరణ బిల్లు పెట్టాల్సిందేనంటూ ఎమ్మార్పీఎస్ రాస్తారోకో

రామాయంపేట: ఏబీసీడీ వర్గీకరణ బిల్లు తీర్మానం చేయాల్సిందేనంటూ ఎమ్మార్పీఎస్ శుక్రవారం రాస్తారోకోకు దిగింది. పట్టణంలోని ఎంపీపీ కార్యాలయం ఎదుట రెండురోజులుగా దీక్షలకు దిగిన నేతలు ఈ మధ్యాహ్నం రోడ్డెక్కారు. ర్యాలీగా కదిలొచ్చి సుమారు 30 నిమిషాల పాటు పాత జాతీయ రహదారిపై బైటాయించారు. రహదారిపై బైఠాయించిన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సముదాయించడంతో రాస్తారోకోను విరమించారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి సింహాచలం నేతృత్వంలో నాయకులు పరమేష్, మల్యాల కిషన్, నర్సగల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

పెద్దశంకరంపేట :శ్రావణమాస వరలక్ష్మీ వ్రతంను పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని సరస్వతి శిశుమందిర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శిశుమందిర్‌లో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా పేటలోని విఠలేశ్వర దేవాలయంలో వరలక్ష్మి వ్రతంను పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేయడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానాచార్యులు వీరప్ప, ప్రబంధకారిణి సభ్యులు దాదిగారి గంగాధర్, దండునారాయణ, క్రాంతిలాల్, పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో



వాయినాలు ఇస్తున్న టేక్మాల్ సర్పంచ్ వరలక్ష్మి

టేక్మాల్: టేక్మాల్ మండలంలోని మహిళలు తమతమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతాన్ని జరిపారు. ఈ సంరదర్భంగా టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వరలక్ష్మి పలువురు మహిళలకు వాయినాలు ఇచ్చారు.

ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కృషి

మెదక్ రూరల్: ముదిరాజ్‌ల ఐక్యత కోసం అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటుచేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకిష్టయ్య పేర్కొన్నారు. శుక్రవారం మెదక్‌మండలం హవేళీఘణపూర్‌లో ముదిరాజ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారా యణ, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, కార్యదర్శి నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

- తక్కువ లోతులో పైపులైన్ల విస్తరణ
- పట్టించుకోని అధికారులు
- పక్కతోవ పడుతున్న లక్ష్యం

పాపన్నపేట: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి మిషన్ భగీరథ లక్ష్యం పక్కతోవ పడుతోంది. ఇంటింటికీ తాగునీళ్లు తాగించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ భగీరథ ప్రయత్నానికి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాపన్నపేట మండలంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ పనుల్లో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. మండలంలో ఇప్పటి వరకు జరిగిన పనుల్లో ఏ ఒక్కటీ కూడా నిబంధనలకనుగుణంగా జరగడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పెద్దలైన్ల మొదలుకొని చిన్నలైన్ల వరకు కాంట్రాక్టర్లు ఆడిందే ఆట అన్నట్టుగా పనులు కొనసాగుతున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో ఏ ఒక్క సంబంధిత అధికారి పర్యవేక్షించిన దాఖలాలు లేకపోవడంతో కాంట్రాక్టర్లు వారి ఇష్టారీతిగా పనులు కానిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ప్రధాన రహదారిపొడవునా 50 ఫీట్ల నిబంధన గాలిలో కలిసింది. మెదక్, బొడ్మట్‌పల్లి రహదారి, పాపన్నపేట మండలంలో 20 కిలో మీటర్ల వరకు విస్తరించి ఉంది. ఈ ప్రధానదారి పొడవున వేసే పైపులైను పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న విషయం స్పష్టంగా కనబడుతోంది. లక్ష్మీనగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న దుర్గమ్మ కమాన్ నుంచి ఏడుపాయలకు వెళ్లే 200 లైన్ వేయాలంటే కాంట్రాక్టర్‌కు ఎన్ని ఇబ్బందులు వచ్చినా మూడున్నర అడుగుల కాల్వ తవ్వి పైపులైన్ వేయాలన్న నిబంధనలు ఉన్నాయి. కానీ ఇక్కడ పైపులైన్ల కోసం తీస్తున్న కాల్వ లోతు అడుగుకు మించడం లేదు. తవ్విన కాల్వలో వేసిన పైపు కాల్వ అంచులకు సమానంగా దర్శనమిస్తుంది. పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారి ఏ ఒక్కరూ కూడా దరిదాపులో లేకపోవడం శోచనీయం. అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగా కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా పనులు కానిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సత్ఫలితంగా తక్కువ లోతులో పడ్డ పైపులైన్ల నుంచి ఏదైనా వాహనం వెళ్లిన లోడుతో కూడుకున్న ఎడ్లబండి వెళ్లినా పైపులు పగిలిపోయే అవకాశం లేకపోలేదు. మిషన్ భగీరథ లక్ష్యానికి ఆదిలోనే తూట్లు పొడుస్తున్న కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మిషన్ భగీరథ పనుల్లో తక్కువ లోతుకు వేస్తున్న పైపులైన్ల దృశ్యం

ఆశింపల్లిలో కొనసాగుతున్న పికెటింగ్

టేక్మాల్: టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆశింపల్లి తండాకు చెందిన కూన్‌సూత్ రవి హత్యకేసు విషయమై ఆశింపల్లి గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్ పోలీసు సిబ్బంది గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు

మెదక్ అర్బన్: రాష్ట్రమంత్రి తన్నీరు హరీశ్‌రావును మెదక్ జిల్లా బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ శుక్రవారం సిద్దిపేటలో కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కు పుట్టిన రోజు కావడంతో మంత్రిని కలిసి ఆశీస్సులు పొందారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు.



మహేష్‌కు స్వీట్ తినిపిస్తున్న మంత్రి హరీశ్‌రావు

వర్షాలు పడాలని శివాలయంలో అభిషేకం

టేక్మాల్: మండల కేంద్రమైన టేక్మాల్‌లోని లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలోని శివాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని కోరుకుంటూ శివాలయంలో 108 జలకడవలతో పాటు శివాలయాన్ని మునిగిపోయే తీరుగా నీరు నింపి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా సప్తభజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ఆలయపూజారి సత్యనారాయణ శర్మ, సుధీర్‌శర్మ, శ్రీధర్‌శర్మతో పాటు భజనమండలి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



108 కలశాలతో పూజలు చేస్తున్న దృశ్యం


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం

మెదక్ అర్బన్: మెదక్ పట్టణంలో పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రుల క్రిష్ణమూర్తి, దోర్బల రాజమౌళిశర్మ, గణేష్‌శర్మ, కొత్తకోట కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలతో పాటు నైవేద్యాలు సమర్పించారు.

పాపన్నపేటలో

పాపన్నపేట: వరలక్ష్మీదేవి వ్రతాన్ని పాపన్నపేట మండలంలో మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పవిత్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా వచ్చిన వ్రతోత్సవ కార్యక్రమానికి వందల సంఖ్యలో మహిళలు హాజరై పూజలు నిర్వహించారు.

సహనం కోల్పోతున్న సీఎం

● టీజేఏసీ జిల్లా అధికార ప్రతినిధి దూడ యాదేశ్వర్


విలేకరులతో మాట్లాడుతున్న యాదేశ్వర్, రాజమల్లు

చిన్నశంకరంపేట: తెలంగాణ ముఖ్యమంత్రి సహనం కోల్పోతున్నారని జేఏసీ జిల్లా అధికార ప్రతినిధి దూడ యాదేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులపై హైకోర్టును ఆశ్రయిస్తే ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ప్రచారం చేయడంలో అర్థం లేదన్నారు. ఆయన సహనం కోల్పోతున్నట్లు మాట్లాడడం సమంజసం కాదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ఆయనకే చెల్లిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీజేఏసీ మండల నాయకులు రాజమల్లు తదితరులు ఉన్నారు.

ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ శాఖ

నిజాంపేట: నిజాంపేటమండలంలోని నస్కల్ గ్రామంలో రామాయంపేట ఎక్సైజ్‌శాఖ నుంచి గీత కార్మిక సొసైటీ 12 ఎకరాల స్థలంలో దాదాపు వెయ్యి ఈత మొక్కలను నాటారు. మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎక్సైజ్ సీఐ రాధాకిషన్, ఎస్ఐ యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈతచెట్ల పెంపకానికి ప్రభుత్వం తరఫున 5 రూపాయలు కేటాయించడం జరుగుతుందని, నాటిన ఈత మొక్కలను సంరక్షించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, గౌడ సంఘం ప్రతినిధులు లింగంగౌడ్, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.


ఈత మొక్కను నాటుతున్న ఎక్సైజ్ సీఐ రాధాకిషన్, ఎస్ఐ యాదగిరి తదితరులు

కేవీపీఎస్ జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

మెదక్: దేశవ్యాప్తంగా దళితుల రక్షణ, కుల వివక్షత, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు జరపడానికి కార్యాచరణ రూపొందించేందుకు 27,28 తేదీల్లో హైదరాబాద్‌లో జాతీయస్థాయిలో దళిత సోషణ్ ముక్తి మంచ్ మహాసభలను సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. శుక్రవారం కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్ఎస్‌పార్టీలు దళితులపై దాడులు చేస్తూ అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ జరగని రీతిలో గోమాంసం పేరుతో.. తలాక్ పేరిట మత వివక్ష రేపుతూ దాడులు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గోమాంసం పేరుతో రైతులను ఊచకోత కోస్తున్నారన్నారు. కులంపేరుతో రోహిత్ వేముల మొదలుకొని నేరెళ్ల ఘటన వరకు దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గీతా, బాలనర్సింలు, రాములు, రాజు, శంకర్, మాణిక్యం తదితరులు ఉన్నారు.

అమ్మపాలే బిడ్డకు అమృతం

● రాజ్‌పల్లిలో తల్లిపాల వారోత్సవాలు


తల్లిపాల వారోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

మెదక్ రూరల్: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని రాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. శుక్రవారం గ్రామంలోని తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యంపై వివరించారు. బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటిదని, పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగిస్తే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్యా, శ్రీవాణితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ద్వారకా చారిటబుల్ సొసైటీ చైర్మన్ మ్యాడం బాలకృష్ణ

మెదక్ అర్బన్: యువత చదువులతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని ద్వారకా చారిటబుల్ సొసైటీ చైర్మన్ మ్యాడం బాలకృష్ణ పేర్కొన్నారు. మెదక్‌లో మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన యువజన సంఘంకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తే విజయాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గడ్డం శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, బాల్‌రాం, యువజన సంఘం బాధ్యులు నాగరాజు, రమేష్, నరేష్, గురుపాదం, ప్రవీణ్, లక్ష్మణ్, భిక్షపతితో పాటు పలువురు పాల్గొన్నారు.


యువతకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న మ్యాడం బాలకృష్ణ

సీఎం అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీమాస్ ఫోరం నేతలు

మెదక్: ప్రజా ఉద్యమాలపై రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మెదక్ పట్టణంలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా టీమాస్ ఫోరం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో నైజాంలాగా కేసీఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాసమస్యలపై స్పందించే ప్రజా, సామాజిక సంఘాలను, లెఫ్ట్ పార్టీలను, పత్రికలను దుర్భాషలాడడం అనాగరికమని మల్లేష్, నాగరాజు, దయాసాగర్, ఎ మల్లేశం, బస్వరాజు, బాబు, తుకారాం అన్నారు. ఈ కార్యక్రమంలో గీతా, బాలనర్సింలు, మమత, దాను, అరవింద్ పాల్గొన్నారు.

వినియోగదారుల సౌకర్యార్థమే ఈ-పాస్ యంత్రాలు


రేషన్‌డీలర్లకు ఈ-పాస్, తూనిక యంత్రాలు అందిస్తున్న తహసీల్దార్ సహదేవ్

చిన్నశంకరంపేట: వినియోగదారుల సౌకర్యార్థమే ఈ-పాస్ యంత్రాలని తహసీల్దార్ సహదేవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లకు ఈ-పాస్, తూనిక యంత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ముగ్గురు వ్యక్తుల వేలిముద్రలను డీలర్లు సేకరిస్తారన్నారు. ఆ ముగ్గురిలో ఎవరు రేషన్‌షాపుకు వెళ్లినా సరుకులు ఇస్తారన్నారు. 25 రేషన్‌షాపుల యజమానులకు ఈ యంత్రాలను అందించామని, ఈనెల నుండే ఈ-పాస్ యంత్రాల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతుం దని పేర్కొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు యథావిధిగా నిర్వహించాలి

మెదక్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలను రద్దు చేసిన విధానాన్ని తిరిగి యథావిధిగా మళ్లీ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ అధ్యక్షుడు వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కన్వీనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి: ఎమ్మార్పీఎస్



రాందాస్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నేతల దీక్షలు

మెదక్: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో షెడ్యూల్ కులాల, మాదిగ ఉపకులాల ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తావద్ద దీక్షల్లో ప్రవీణ్‌కుమార్, కుమార్, మహేష్, వీరయ్య, అజయ్, ప్రభుదాస్, పోచయ్య, నాని, రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ గత 23 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి జాతీయపార్టీ బీజేపీ మొదటినుంచి మద్దతిస్తూ సంపూర్ణ సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బిల్లు పాస్ చేయించడంలో చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మార్పీఎస్ దీక్షకు కాంగ్రెస్ సంఘీభావం


రిలే దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట: ఎమ్మార్పీఎస్ రిలేదీక్షకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని దీక్షాశిబిరం వద్ద కాంగ్రెస్ నాయకులు శ్రీమాన్‌రెడ్డి మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వంపై తెలుగు రాష్ట్రప్రభుత్వాలు ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, నాయకులు చంద్రయ్య, ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మురళిమాదిగ, మండలశాఖ అధ్యక్షులు గైనికాడి స్వామి, రాజు తదిత రులు పాల్గొన్నారు.

'రవాణా సౌకర్యం కల్పించండి'

కౌడిపల్లి: మండలంలోని మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం లేక కౌడిపల్లి జూనియర్ కళాశాలకు సకాలంలో రాలేకపోతున్నామని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌడిపల్లి, చిలప్‌చెడ్ ఉమ్మడి మండలాలకు ఒకే జూనియర్ కళాశాల ఉండడంతో మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ కళాశాలకు రావాలంటే రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన జోగిపేట, నర్సాపూర్, మెదక్ మండలాలకు చెందిన ప్రైవేటు కళాశాలలు మారుమూల గ్రామాలకు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి విద్యార్థులను తరలిస్తున్నారు. ప్రస్తుతం కౌడిపల్లి కళాశాలలో 600 మంది విద్యార్థులకు విద్యాబోధన చేసేంత సామర్థ్యం ఉన్నప్పటికీ కేవలం 500 మంది మాత్రమే హాజరవుతున్నారు. మారుమూల గ్రామాలైన ముత్రాజుపల్లి, సోమక్కపేట, రాందాసుగూడ, రాజీపేట్, సలావత్‌పూర్, అంతారం, జగ్గంపేట్ తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తే అత్యధిక సంఖ్యలో కౌడిపల్లి జూనియర్ కళాశాలలోనే చదివేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. రవాణా శాఖ అధికారులు చొరవ తీసుకొని మారుమూల గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం కల్పించాలని నందిని, మీనాక్షి, మాధవి, లత, స్వరూప, రేవతి, చందు అనే విద్యార్థులు పేర్కొంటున్నారు.



కౌడిపల్లి జూనియర్ కళాశాల భవనం

బస్సు సౌకర్యం కల్పించండి



రాందాసుగూడ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తే మరికొందరు విద్యార్థులు కూడా కౌడిపల్లి జూనియర్ కళాశాలలో చేరుతారు.

-నందిని, విద్యార్థిని (రాందాసుగూడ)

ఆటోల్లోనే ప్రయాణిస్తున్నాం



రవాణా సౌకర్యం లేకపోవడంతో రాజీపేట్ గ్రామం నుంచి ఆటోల పైనే ప్రయాణిస్తున్నాము. దీంతో సమయం సరిపోవడం లేదు. బస్సులు ఏర్పాటు చేస్తే మా గ్రామం నుంచి మరో 20 మంది విద్యార్థులు కళాశాలకు వస్తారు.

-మీనాక్షి, విద్యార్థిని (రాజీపేట్)

'డబుల్' ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

● ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీశైలం

కౌడిపల్లి: డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కౌడిపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీశైలం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తునికి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 245లో రెండు ఎకరాల భూమిని డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. ఆ గ్రామంలో 130మంది లబ్ధిదారులను మొదటి విడతగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

సిజంటా పరిశ్రమ కార్మికుల ధర్నా



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

శివ్వంపేట: కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నారని మండల పరిధిలోని సిజంటా పరిశ్రమ ఎదుట సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలో రెగ్యులర్ కార్మికులుగా 40 మంది పని చేస్తున్నామని, ఇపుడు 20మందిని తొలగిస్తున్నారన్నారు. అదేవిధంగా కనీస వేతనాలు అమలు చేయకుండా మహిళలకు 210రూపాయలు, పురుషులకు 220రూపాయలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు పరిశ్రమపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

సీఎం స్థాయికి తగ్గట్టు మాట్లాడటం లేదు

● డీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్


విలేకరులతో మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ తన స్థాయికి తగ్గట్టు మాట్లాడటం లేదని డీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ జీవన్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రావడానికి ప్రధాన కారణమైన కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఇష్టానుసారంగా మాట్లాడటం విచారకరమన్నారు. పైగా కాంగ్రెస్ పార్టీ నుంచి నాయకుడిగా వచ్చినా కేసీఆర్ ఇపుడు పార్టీకి చెందిన మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరా గాంధీలను కూడా విమర్శించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఇదేవిధంగా మాట్లాడితే ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు.

'నీటి సమస్యను పరిష్కరించండి'

నర్సాపూర్‌రూరల్: మండలంలోని రుస్తుంపేట గ్రామంలోని నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంపీటీసీ లక్ష్మీఅశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో తీవ్ర నీటి సమస్య ఏర్పడిందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామంలోని నీటి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ అశోక్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు


నర్సాపూర్ ఎల్లమ్మ ఆలయంలో, శివ్వంపేట సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

నర్సాపూర్: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఎల్లమ్మ ఆలయంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాముహిక వరలక్ష్మి వ్రతాలకు మహిళలు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక సాయిబాబా ఆలయంలో కూడా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.

శివ్వంపేట: శ్రావణమాసం పురస్కరించుకొని మండలంలోని పలు ఆలయాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటలోని సంతోషిమాతా ఆలయంలో పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడిబియ్యం సమర్పించి, వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో

చిలప్‌చెడ్: మండలంలోని పలు గ్రామాల్లోని మహిళలు శుక్రవారం ఘనంగా వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మండలంలోని చిట్కూల్ చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపుబొట్టు ఇచ్చుకున్నారు. ఆలయ పూజారి ప్రభాకర్‌శర్మ పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

'ఆట స్థలాన్ని పునరుద్ధరించండి'


రాళ్లు తేలిన పాఠశాల మైదానం

నర్సాపూర్‌రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని ఆట స్థలానికి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల గ్రౌండ్‌కు చాలా రోజులుగా మరమ్మతులు చేయలేదని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రౌండ్‌లో గుంతలు ఏర్పడ్డాయని, రాళ్లు తేలాయని, ఆటలాడే సమయంలో గాయాల పాలవుతున్నామన్నారు. విద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదన్నారు. పాఠశాలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వచ్చిన సమయంలో గ్రౌండ్‌కు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రౌండ్‌కు మరమ్మతులు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

కొల్చారం: రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం కొల్చారంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణంలో తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేయడం జరిగిందని, ఇపుడు బియ్యం మాత్రమే పంపిణీ చేయడంతో డీలర్లకు కమీషన్లు కూడా రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని అప్పుల పాలవుతున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నల్గురు డీలర్లు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నప్పటికీ ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు దుర్గయ్య, ఎగౌండ, స్వామి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రవికుమార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం

మండలంలోని నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌ను శుక్రవారం రేషన్ డీలర్లు సన్మానించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాస్‌ను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ డీలర్లకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించారన్నారు.

ఐకేపీ సీసీలతో సమీక్ష సమావేశం

శివ్వంపేట: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐకేపీ సీసీలతో ఏపీడీ జైసింగ్, ఎంపీడీవో కౌసల్యాదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి రుణాలు ఇప్పటి వరకు ఎన్ని ఇప్పించారని, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రుణాలు కట్టే విధంగా చూడాలని, మహిళలకు ఇచ్చిన రుణాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అనంతయ్య, సీసీలు పోచయ్య, బాల్‌రాజ్, స్వప్న, భాగ్యలక్ష్మి, సరిత తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ జైసింగ్

చీకటి భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

తూప్రాన్‌రూరల్: ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులను చదువులకు సిద్ధం చేయడానికి ఉద్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామాల్లో సొంత భవనాలు లేక శిథిలావస్థల్లో ఉన్న చీకటి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆ భవనాల్లో ఇమడలేక చిన్నారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రాలు చాలా వరకు రేకులషెడ్డు, పెంకుటిండ్లల్లో కొనసాగుతున్నాయి. భవనాలు మంజూరైన చోట పనులు నత్తనడకన సాగుతున్నాయి. తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో 71 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 27కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. తూప్రాన్ సెక్టార్‌లో 25 కేంద్రాలుండగా అందులో 10 కేంద్రాలకు పక్కా భవనాలున్నాయి. తూప్రాన్ పట్టణంలోనే 10 కేంద్రాలకు రెండు, మనోహరాబాద్ సెక్టార్‌లో 25 కేంద్రాల్లో తొమ్మిది, ఘనపూర్‌సెక్టార్‌లో 21 కేంద్రాల్లో 8 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలున్నాయి. మిగతా కేంద్రాలు కొన్ని అద్దె భవనాల్లో, మిగతావి శిథిలావస్థల్లో ఉన్న పాఠశాల గదుల్లో కొనసాగుతున్నాయి. కాళ్లకల్, చెట్లగౌరారం, కూచారం గ్రామాలకు కొత్తగా భవనాలు మంజూరైనప్పటికీ నిర్మించేందుకు స్థలాల కొరత ఉంది. ఇమాంపూర్, యావాపూర్ గ్రామాలకు రెండేళ్ల క్రితం అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఒక్కో భవనానికి రూ.9లక్షలు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్షంతో ఇంతవరకు ఒక్క భవనం కూడా పూర్తి కాలేదు. ఇమాంపూర్ గ్రామంలో ఎంపీపీ అధ్యక్షుడు స్వయంగా చేపట్టిన భవనం పనులు స్లాబ్ వరకే పరిమితమయ్యాయి. ఒక పక్కన పిల్లలు, అందులోనే వంటకాలు చేయడం, సామగ్రిని నిల్వ చేయడంతో గది ఇరుకైపోయి పిల్లలకు ఊపిరాడక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.





ఇమాంపూర్‌లో శిథిలావస్థలో ఉన్న చావిడిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం, రెండేళ్లుగా స్లాబ్‌కే పరిమితమైన అంగన్‌వాడీ భవనం

రేషన్‌డీలర్లకు తూకం యంత్రాల పంపిణీ

నార్సింగి(చేగుంట): రేషన్ డీలర్లకు తూకం యంత్రాలను తహసీల్దార్ కృష్ణవేణి శుక్రవారం అందజేశారు. నార్సింగిలోని తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి రేషన్‌డీలర్లకు తూకం యంత్రాలను అందించారు. ఈ-పాస్ యంత్రాల ద్వారా రేషన్ లబ్ధిదారుల వేలిముద్రలను తీసుకొని ఎలక్ట్రానిక్ కాంటాలతో సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ-పాస్, ఎలక్ట్రానిక్ యంత్రాలను సరిగ్గా వినియోగించుకోవాలని తహసీల్దార్ కృష్ణవేణి రేషన్ డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఆర్‌ఐ నాగవర్ధన్, వీఆర్‌వో కిషన్, భూమయ్యలతో పాటు రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

6న తూప్రాన్‌లో గుండె వ్యాధుల శిబిరం

తూప్రాన్: పట్టణంలోని సుష్మా ఆసుపత్రిలో ఈనెల 6న ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గుండె వ్యాధులకు సంబంధించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ తూప్రాన్‌స్నేహ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా తెలిపారు. లయన్స్‌క్లబ్ సహకారంతో హైదరాబాద్‌లోని మాక్స్ క్యూర్ ఆసుపత్రి, సుష్మా ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉ.9గంటల నుంచి మ.1గంట వరకు వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్ష, ఈసీజీ, 2డీ ఏకో పరీక్షలు చేయనున్నట్లు రవీందర్‌గుప్తా తెలిపారు. ప్రజలు అధికంగా హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు.

తూప్రాన్‌లో తల్లిపాల వారోత్సవం

తూప్రాన్: పట్టణంలో తల్లిపాల వారోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహిళా భవనం వద్ద అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తల్లిపాల వారోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాలు పిల్లలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రసవం జరగ్గానే పిల్లలకు ముర్రుపాలు తప్పక తాగించాలన్నారు. ముర్రుపాలలో రోగనిరోధకశక్తి ఉంటుందని వారు వివరించారు. ఇందులో కృష్ణవేణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో

చేగుంట: తల్లిపాల వారోత్సవాలను మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించారు. రెడ్డిపల్లి, కసాన్‌పల్లి, పెద్దశివనూర్, కర్నాల్‌పల్లి, రాంపూర్ తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల, రెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమ, సురేఖ, శోభ, యాదమ్మ, శ్రీదేవి, రాంకుమారితో పాటు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో రక్షాబంధన్

చేగుంట: రాఖీపౌర్ణిమ పండగను ప్రజామాత బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన చేగుంటలోని బ్రహ్మకుమారి సేవా కేంద్రంలో గురువారం రాత్రి రాఖీ పౌర్ణిమ విశేషాన్ని వివరించారు. అనంతరం రక్షా కంకణాలను ధరింపజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి బహెన్ లత, రమేష్, గోవింద్ కృష్ణ, రాజేశ్వర్, నాగభూషణంతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల తనిఖీ

చేగుంట: ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో చేగుంట నుంచి వివిధ మార్గాల్లో వేసిన రహదారులను శుక్రవారం పరిశీలించారు. చేగుంట నుంచి మక్కరాజ్‌పేట, బోనాల వైపు వెళ్లే రహదారుల్లో కిలోమీటరుకు ఒక చోట తవ్వి నాణ్యతను పరిశీలిస్తున్నారు. నాణ్యతను పరిశీలిస్తూ అవసరమైన మార్పులు, చేర్పులను అధికారులు సూచిస్తున్నారు.

కార్యాలయాల్లో కానరాని పరిశుభ్రత

చేగుంట: అన్నిచోట్ల స్వచ్ఛభారత్, పరిశుభ్రత ఉంటుందేమో గానీ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మాత్రం అవేమీ కనబడవు. మండలపరిషత్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగినా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రతిరోజు మండల, జిల్లాస్థాయి అధికారులు, ప్రజలు నిత్యం వచ్చిపోతున్నా పిచ్చిమొక్కలను కనీసం తొలగించాలనే ఆలోచన రాకపోవడం విడ్డూరం.

ఓపెన్ డిగ్రీ దరఖాస్తులకు ఆహ్వానం

చేగుంట: మండలకేంద్రమైన చేగుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్‌డిగ్రీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ అధ్యాయన కేంద్రంలో మొదటి సంవత్సరం అర్హత పరీక్షకు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, దరఖాస్తులు చేసుకునే వారు కళాశాలలో సంప్రదించాలని, ఇతర వివరాలకై 9849101152 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

తూప్రాన్: మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని గీతా మందిరంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలు, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.



తూప్రాన్‌లో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

చేగుంటలో

చేగుంట: శ్రావణమాసంలో నిర్వహించే వరలక్ష్మి వ్రతాన్ని మండలకేంద్రమైన చేగుంటలోని కృష్ణవేణి పాఠశాలలో పురోహితుడు శివనూరి రామచంద్రశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో వరలక్ష్మి వ్రత విధాన ఫలితాన్ని విద్యార్థులకు వివరించారు. సంపద ఉంటే చదువు రాదని, చదువు ఉంటే సంపద దానంతటదే వస్తుందని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

వెల్దుర్తిలో

వెల్దుర్తి: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు, వరలక్ష్మి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఇది సర్కారు మరుగుదొడ్ల బాగోతం!

తూప్రాన్‌రూరల్: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జనను నిషేధించేందుకు గ్రామాల్లో ప్రభుత్వం ఇంటింటికీ నిర్మించి ఇచ్చిన వ్యక్తిగత మరుగుదొడ్లు(ఐహెచ్‌హెచ్‌ఎల్)నాసిరకంగా ఉన్నాయనడానికి తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లిలో వరుసగా నిర్మించిన ఈ మరుగుదొడ్లే నిదర్శనం. రెండు నెలల క్రితమే వీటిని నిర్మించగా గాలికి పైకప్పు రేకులు ఎగిరిపోయి. ఐదు మరుగుదొడ్లు వృథాగా ఉన్నాయి. మరుగుదొడ్ల పక్కన ముగురుకాల్వ, చుట్టూ దట్టమైన పొదలు, గడ్డి పెరిగిపోయి అందులోకి పోవడానికి కూడ వీలు లేకుండా ఉంది. లబ్ధిదారులు కనీసం మరుగుదొడ్ల ఎదుట పెరిగిన గడ్డిని కూడా తొలగించుకోవడం లేదు. పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కనే ఈ మరుగుదొడ్లు నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. గ్రామాల్లో మరుగుదొడ్లు వాడుతున్నట్లు, బహిరంగ మల విసర్జన నిషేధించబడినట్లు అధికారులు చెబుతున్న మాటల్లో నిజమెంతో వీటిని చూస్తే తెలుస్తుంది.



బ్రాహ్మణపల్లిలో పైకప్పు రేకులు ఊడిపోయి, గడ్డి మధ్యలో వృథాగా ఉన్న మరుగుదొడ్లు

కేంద్ర ప్రభుత్వ బోరు బావిని ప్రారంభించిన నాయకులు

వెల్దుర్తి: గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిలువలు, భూగర్భ జలాల పరిశోధనకు మండలానికి మంజూరైన కేంద్ర ప్రభుత్వ బోరు బావిని శుక్రవారం దామరంచలో టీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. మండలానికి రెండు బోరు బావులు మంజూరు కాగా వెల్దుర్తిలోని హిందుస్మశాన వాటిక వద్ద బోరు బావిని తవ్వించినట్లు తెలిపారు. మరో బోరు బావిని దామరంచలోని విఠలేశ్వర ఆలయం సమీపంలో తవ్వించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం భూగర్భ జలాల పరిశోధనకు 600 ఫీట్లలో నీటి నిలువలు గుర్తించేందుకు అనుమతినిచ్చిందన్నారు.

'పింఛనిచ్చి ఆదుకోండి'





కాలిన గాయాలను చూపిస్తున్న ఆంజనేయులు, తొలగించిన చేయిని చూపిస్తున్న దుర్గాబాయి

వెల్దుర్తి: విధిరాతతో ప్రమాదానికి గురై అవిటివారిగా బతుకుతున్న తమకు ప్రభుత్వం పింఛన్ అందించడం లేదని మండలంలోని కుకునూర్, రామాయపల్లికి చెందిన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుకునూర్‌కు చెందిన ఆంజనేయులు చిన్నతనంలోనే ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో శరీరంతో పాటు చేయి, తలభాగం కాలిపోయి చెవులు వినిపించడం లేదు. ఎన్నోమార్లు పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. అలాగే విద్యుత్ షాక్ వల్ల కుడి చేయి తొలగించారని, అయినా పెన్షన్ అందడం లేదని రామయపల్లికి చెందిన దుర్గాబాయి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వికలాంగులకు పెన్షన్ అందించి ఆదుకోవాలని తెలిపారు.

"లింగారెడ్డిపేటలో 35 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా"

వెల్దుర్తి: మండలంలోని రామంతాపూర్ పంచాయతీలోని లింగారెడ్డిపేటలో సుమారు 35ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఉద్యోగులు, ఇతరులు కబ్జా చేశారని ఆ గ్రామానికి చెందిన బాగన్నగారి శర్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఉద్యోగి ములుగు నర్సింహారెడ్డి తమ మామ సంజీవరెడ్డికి చెందిన 191/10 సర్వే నెంబర్‌లో 37 గుంటల భూమిని కబ్జా చేశారని తెలిపారు. పక్కనే ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమిని కూడా నర్సింహారెడ్డి కబ్జా చేసి దర్జాగా ప్రహరీ గోడ ఏర్పాటు చేసి గేట్లు వేశారని తెలిపారు. అలాగే ఇతరులు కూడా 35ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని, సర్వే చేయాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన నర్సింహారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


సంగారెడ్డి జిల్లా రాజంపేటలోని లక్ష్మి ఆలయంలో భక్తుల రద్దీ

సౌభాగ్యలక్ష్మీ..రావమ్మా!

శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలో పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.









సిద్దిపేట సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న యువతి, మెదక్‌లోని జీకేఆర్ గార్డెన్‌లో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు, రాజంపేటలో వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు, అమ్మవారి ప్రత్యేక అలంకరణ

రాఖీ పౌర్ణమి రోజు చంద్రగ్రహణం


సిద్ధాంతి మహేశ్వర శర్మ

- **ఉదయం 11 లోపే రాఖీ కట్టాలి**
- **మధ్యాహ్నం 2 లోపే భోజనాలు చేయాలి**
- **మహేశ్వర సిద్ధాంత శర్మ**


సంగారెడ్డి రూరల్ : అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగానికి, అనుబంధానికి, ఆత్మీయతలకు ప్రతిబింబంగా నిలిచేది రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పండగ. పౌర్ణమి రోజునే చంద్రగ్రహణం రానున్నదని సిద్ధాంతి మహేశ్వర సిద్ధాంత శర్మ తెలిపారు. ఆగస్టు 7వ తేది శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజు శ్రవణా నక్షత్రం, మకర రాశిలో గ్రహణం ఏర్పడుతుందని ఆయన వెల్లడించారు. ఈ చంద్ర గ్రహణం 10.52 నిమిషాలకు వచి రాత్రి 12.48 గంటల వరకు ఉంటుందన్నారు. కావున ఉదయం చేయాల్సిన కార్యక్రమాలు నిర్వహించకోవచ్చు, నూతన యజ్ఞ పవిత్ర ధారణ చేసుకోవచ్చని, కానీ నవ ఉపకర్మ చేయకూడదని తెలిపారు. భాద్రపద కర్మ పౌర్ణమి రోజున ఆచరించాలని చెప్పారు. రాఖీపౌర్ణమి రోజున గ్రహణం వస్తున్నందున అన్నా, తమ్ముళ్లకు రక్షాబంధన్ ఉదయం 11 గంటలలోపే కట్టాలని, మధ్యాహ్నం రెండు గంటల వరకు భోజనాలు ముగించుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో భోజనం చేయరాదన్నారు. బాలలు, వృద్ధులు, వ్యాధిగ్రస్థులు, ఉపవాస దీక్షలు పాటించని వారు రాత్రి 8 గంటల లోపు భోజనాలు చేయొచ్చన్నారు. కొత్త జంధ్యం వేసుకునే వారు ఉదయం 10.30 గంటల లోపు వేసుకోవాలని, ఆలయాల్లో ఉదయం 10.45 గంటల వరకు పూజల నిమిత్తం దర్శనం కల్పించి ఆలయాలను మూసివేయాలని సూచించారు. ఈ ఏడు ఉపనయనం చేసుకున్న వారు ఉపకర్మ చేయకూడదని తెలిపారు. రుగ్వేదులు భాద్రపద శుద్ద త్రయోదశి సోమవారం, యజుర్వేదులు భాద్రపద శుద్ధపూర్ణిమ బుధవారం ఉపకర్మ ఆచరించాలని వెల్లడించారు. రాఖీ పౌర్ణమి రోజున యజ్ఞోపవిత ధారణ చేసుకునే వారు సోమ, మంగళవారం రెండు రోజుల పాటు యజ్ఞోపవీత ధారణ చేసుకోవాలన్నారు. గ్రహణం ముగిసిన అనంతరం ఇంటిని శుభ్రంగా నీటితో కడిగి భగవంతుడికి ప్రత్యేక పూజలు చేసి దినచర్య కార్యక్రమాలు చేసుకోవాలని సూచించారు.

వంద పడకలకు గ్రహణం

- **వైద్యుల కొరతతో అందని కార్పొరేట్ వైద్యం**
- **నర్సులు ఫుల్... వైద్యులు నిల్**
- **అంబులెన్స్ ఉన్నా డ్రైవర్ లేని దుస్థితి**
- **టెక్నీషియన్ లేక మూలన పడిన స్కానింగ్‌మిషన్**
- **ప్రైవేటు ల్యాబ్‌ల దందాకు సిబ్బంది సహకారం?**
- **పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిని వీడని సమస్యలు**

పటాన్‌చెరు : పటాన్‌చెరు వందపడకల ప్రభుత్వ ఆసుత్రిని సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులకు చెక్ పెట్టాలని ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు యథాతథంగానే ఉంటున్నాయి. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన టంగుటూరి అంజయ్య స్మారక వందపడకల ఆసుపత్రిలో పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన తయారైంది. కోట్లాది రూపాయలు వెచ్చించి విశాలమైన భవనం, మౌలిక వసతులు కల్పించినా ఆశించిన స్థాయిలో ప్రజలకు వైద్యం అందడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పేరుకు వంద పడకల ఆసుపత్రి అని ప్రకటించినా అందుకు తగ్గట్టుగా సేవలు అందుబాటులోకి రాలేదు.

ఆస్పత్రిలో అవసరం మేరకు సిబ్బంది అందుబాటులో లేరు. రోజురోజుకీ రోగుల సంఖ్య పెరుగుతున్నా సేవలు మాత్రం ఆస్థాయిలో అందడం లేదు. పటాన్‌చెరు, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల, అమీన్‌పూర్ మండలాల నుంచి నిత్యం పెద్దఎత్తున ఆసుపత్రికి రోగులు వస్తున్నారు. అవుట్‌పేషెంట్ల సంఖ్య రెండు వందల పైచిలుకుగా ఉంది. కేవలం డ్యూటీ డాక్టర్లు వారిని పరీక్షించి మందులు ఇచ్చి పంపిస్తున్నారు. సీరియస్ రోగులు వస్తే ఇక్కడ వైద్యం చేయడం కుదరదని సంగారెడ్డి లేదా హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఆసుపత్రిలో కీలకమైన నలుగురు సివిల్ సర్జన్ పోస్టులకు కేవలం ఒక్కరితోనే నెట్టుకు వస్తున్నారు. సహాయకులుగా పనిచేసే సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు మొత్తం 12 ఉండగా అందులో 9 పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. అందులో సగానికి పైగా డాక్టర్లు కాంట్రాక్టు పద్ధతిలోనే నియమించారు. మొత్తం 24 మంది నర్సులకుగాను 23 మందిని నియమించారు. ఆసుపత్రిలో ఎంతో కీలకమైన రేడియాలోజిస్ట్ పోస్టు ఇంతవరకు భర్తీ కాలేదు. సర్జరీలు చేసేందుకు కావాల్సిన మత్తుడాక్టర్ అనస్తీషియా పోస్టు సైతం ఇంతవరకు భర్తీ చేయలేదు. ఇక పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మొత్తం 19 పారామెడికల్ సిబ్బందికి గాను 13 పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం. హెడ్‌నర్స్, హెల్త్‌ఇన్‌స్పెక్టర్, రేడియోగ్రాఫర్, ఫిజియోథోరపిస్ట్, డీఆర్‌ఎ, జూనియర్ అనలిస్ట్, రెఫ్రాక్షనిస్ట్, ఆడియోటెక్నీషియన్, ల్యాబ్‌అటెండర్, అంబులెన్స్‌డ్రైవర్, ఎలక్ట్రీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉదయం అవుట్‌పేషెంట్లతో కలకలలాడుతూ సాయంత్రానికి బోసిపోతోంది. మధ్యాహ్నం తరువాత దాదాపు అన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నారు. రాత్రి ప్రమాదాలకు గురై వచ్చే వారిని గాంధీకి పంపించి చేతులు దులుపుకుంటున్నారు. ఆసుపత్రిలో అంబులెన్స్ ఉన్నా డ్రైవర్ లేకపోవడం గమనార్హం.


పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి

హైరిస్క్ సెంటర్‌లో సమస్యల తిష్ట

ఆర్భాటంగా ఏర్పాటు చేసిన హైరిస్ సెంటర్‌కు మంచి ఆదరణ లభించింది. నెలకు సరాసరి సుమారు 120 నుంచి 150 వరకు కాన్పులను నిర్వహిస్తున్నారు. పేద, మధ్య తరగతి వర్గాల వారు పెద్ద ఎత్తున సెంటర్‌కు వస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులు భారం కావడంతో ఎక్కువగా వందపడకల ఆసుపత్రిపై ఆధారపడుతున్నారు. కాగా సిబ్బంది కొరత, వసతుల లేమి వల్ల ఆశించిన స్థాయిలో హైరిస్క్ సెంటర్ పనిచేయడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అత్యవసర సమయంలో ఆపరేషన్లు చేసేందుకు అనస్తీషియా డాక్టర్ అందుబాటులో లేరు. హైరిస్క్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి భర్తీ చేయలేకపోయారు. ఇక ల్యాబ్ టెస్ట్‌ల నివేదికలను విశ్లేషించే కీలకమైన రేడియాలజిస్ట్ పోస్టు భర్తీ కాలేదు. కేవలం ఇద్దరు గైనకాలజిస్ట్‌ల పర్యవేక్షణలో నెలకు వందకు పైగా కాన్పులు జరుగుతున్నాయి. ఆసుపత్రికి నలుగురు అవసరం కాగా కేవలం ఇద్దరే పనిభారం మోస్తున్నారు. ఇద్దరు గైనకాలజిస్టులలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసుంధర ఒకరు. ఒక వైపు ఆసుపత్రి నిర్వహణ బాధ్యతతో పాటు మరో వైపు కాన్పుల నిర్వహణ తలకుమించిన భారంగా మారింది. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో సర్జరీలు చేయడం క్లిష్టంగా మారింది.

సిబ్బంది కొరతతో ప్రైవేటు ల్యాబ్‌లకు

పారామెడికల్ సిబ్బంది కొరతతో ప్రైవేటు ల్యాబ్‌లకు కాసుల పంట కురుస్తోంది. ఆసుపత్రి చుట్టుపక్కలు పది వరకు ప్రైవేటు ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ ఉన్నా టెక్నీషియన్ లేడన్న సాకుతో ప్రైవేటు ల్యాబ్‌కు పంపుతున్నారు. ఆసుపత్రి సిబ్బంది లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని కమీషన్లు తీసుకుంటున్నారన్న ఆరోణలు వ్యక్తం అవుతున్నాయి. హైరిస్క్ సెంటర్‌లో సిబ్బంది కొరతపై ఆసుపత్రి సూపరెంటెండ్ ఉన్నతాధికారులకు అనేక మార్లు నివేదికలు పంపించారు. ఇద్దరు గైనకాలజిస్టులు, ఇద్దరు పిడియాట్రీషియన్లు, ముగ్గురు మెటర్నరీ అసిస్టెంట్‌లు, పదిమంది సానిటేషన్ సిబ్బందిని నియమించాల్సిన అవరసరముంది.



ఆఫీసర్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు, పక్కన వివేక్, వినోద్ తదితరులు

అంతర్జాతీయ స్థాయిలో సిద్దిపేట మార్మోగాలి

వసతులను సద్వినియోగం చేసుకోవాలి ● ఒలింపిక్ స్థాయిలో ఆధునిక స్విమ్మింగ్‌పూల్
విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు అవసరం : మంత్రి హరీశ్‌రావు
హరీశ్‌లాంటి నాయకుడు ఉండడం సిద్దిపేటవాసుల అదృష్టం ● దేశానికి ఐకాన్‌గా జిల్లా
హెచ్‌సీఏ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.వివేక్



తైక్వాండో ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి, తదితరులు

సిద్దిపేట మున్సిపాలిటీ : అంతర్జాతీయస్థాయిలో ఆడగలిగేలా క్రీడాకారులను అందించి సిద్దిపేట పేరును మార్మోగేలా చేయటమే లక్ష్యమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో మినీ స్టేడియం, ఆఫీసర్స్ క్లబ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. అన్ని రంగాల్లో పట్టుదలగా ముందుకెళ్తున్న సిద్దిపేట పట్టణంలో, ఇప్పటి నుంచి కేవలం జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయస్థాయిలో పాల్గొనేలా క్రీడాకారులను దేశానికి అందించటమే సిద్దిపేట క్రీడాకారుల లక్ష్యంగా ఉండాలని అన్నారు. అన్ని హంగులతో రూపొందించిన మినీ స్టేడియాన్ని పట్టణంలోని క్రీడాకారులకు అందిస్తున్నామని, ఇక దానిని సరిగ్గా ఉపయోగించుకుని మంచి పేరు తెచ్చుకునే బాధ్యత వారిదేనన్నారు. ఇప్పటికే 16 రకాల క్రీడలకు సంబధించిన అధునాతన సౌకర్యాలు మినీ స్టేడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక క్రీడాకారుడు తనకు ఎలాంటి సౌకర్యాలు కావాలని కోరుకుంటాడో అలాంటి సౌకర్యాలు అన్నింటినీ కల్పించామని, ఇంకా ఇవి సరిపోకుంటే పెంచుతామని కూడా తెలియజేశారు. ఆధునిక జిమ్ సౌకర్యం, ఒలపింక్‌స్థాయి సౌకర్యాలతో స్విమ్మింగ్ పూల్, క్రీడా కోర్టులు, డ్రెస్సింగ్ రూమ్స్ ఇలా అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని రంగాల్లో ముందుకెళ్తున్న సిద్దిపేట పట్టణం ఇప్పటి నుంచి క్రీడారంగంలో కూడా ముందుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఎందుకంటే క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేయటం గొప్పకాదని, వాటిని సరియైన రీతిలో సద్వినియోగం చేసుకోవటం ముఖ్యమని అన్నారు. క్రీడాకారుల కోరిక మేరకు ఇప్పటికే ఉన్న షటిల్ కోర్టుకు అదనంగా ఇంకో 4 కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ కష్టానికి ప్రతిఫలం కనిపించాలంటే సిద్దిపేట స్టేడియం ప్రతినిధులు ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రీడా పోటీలను నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు, యువకులకు శారీరక మానసిక ధృడత్వానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల కలిగే ఏకాగ్రతతో పాటు చదువులో కూడా రాణించవచ్చని తెలిపారు.

ఆఫీసర్స్ క్లబ్ ప్రారంభం

సిద్దిపేట జిల్లా అయ్యాక చాలా మంది జిల్లాస్థాయి అధికారులు ఇక్కడకు వచ్చారని మంత్రి గుర్తుచేశారు. అన్ని శాఖల్లో ఉన్న గెజిటెడ్, జిల్లాస్థాయి అధికారులకు కావలసిన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఆఫీసర్స్ క్లబ్‌ను కూడా ప్రారంభించామని చెప్పారు. ఆఫీసర్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మంచి సేవలు అందించగలుగుతారని మంత్రి అన్నారు. అందుకే వారికోసం జిమ్, క్రీడా వసతులు కలిగిన క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ పని చేసి బదీలలపై వెళ్లిన అధికారులు వేరే ప్రాంతాల్లో కూడా సిద్దిపేటను, సిద్దిపేట ప్రజలను గుర్తుంచుకునేలా ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

సిద్దిపేట రోల్‌మోడల్

మంత్రి హరీశ్‌రావును నాయకుడిగా కలిగి ఉండటం సిద్దిపేట వాసుల అదృష్టమని హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహదారు జి.వివేక్ అన్నారు. శుక్రవారం ఆయన మినీస్టేడియం, ఆఫీసర్స్ క్లబ్ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కలలు కంటున్న బంగారు తెలంగాణ సాధనలో హరీశ్‌రావు అలుపెరుగని సైనికుడిలా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏదైనా రోల్ మోడల్ జిల్లా ఉందంటే అది సిద్దిపేటే అని అన్నారు. సిద్దిపేటకు సంబధించిన ఏదైనా పని ఉందటే ఒకటికి నాలుగుసార్లు గుర్తు చేస్తూ పని పూర్తయ్యేంత వరకు పట్టు వదలడని చెప్పారు. మంచి నాయకుడని, అన్ని విషయాల్లో హరీశ్‌రావును ఆదర్శంగా తీసుకోవచ్చని ప్రశంసల్లో ముంచెత్తాడు. తమ కుటుంబానికి సిద్దిపేట నియోజకవర్గంతో ఎప్పటి నుంచో దగ్గరి సంబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తమ తండ్రి వెంకటస్వామి సిద్దిపేట నుంచి ఎంపీగా పని చేశారని గుర్తుచేసుకున్నారు. మినీ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు, మెకనైజ్‌డ్ రోలర్, గ్రాస్ రోలర్, కట్టర్ లాంటి సౌకర్యాలను వారం రోజుల్లో అందిస్తామని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జి.వినోద్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుఖ్‌హుస్సేన్, పాతూరి సుధాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రామరెడ్డి, జేసీ పద్మాకర్, మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, కౌన్సిలర్లు ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, వెంకట్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, జావేద్, మోయిజ్, నాయకులు, క్రీడాకారులు తదితరుల పాల్గొన్నారు.



వివేక్‌తో చెస్ ఆడుతూ



మినీ స్టేడియంలో టేబుల్‌టెన్నిస్ ఆడుతున్న మంత్రి హరీశ్‌రావు



బౌలింగ్ వేస్తున్న హరీశ్‌రావు



బ్యాడ్మింటన్ ఆడుతూ పరిగెడుతున్న మంత్రి

ఆరడుగుల ఆల్‌రౌండర్



బ్యాట్‌పట్టిన మంత్రి..



విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన మినీస్టేడియాన్ని శుక్రవారం మంత్రిహరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా క్రికెట్, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్ తదితర ఆటలు ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాలని వివిధ ఆటలు ఆడినట్లు మంత్రి తెలిపారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

మెంటల్ ఎబిలిటి

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
ఎ) EHWYST బి) WEYHTS
సి) TUSEWJ డి) ఏదీకాదు

2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
ఎ) LHLEQK బి) LQLKHE
సి) LELQHK డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
ఎ) GZOGMV బి) GMVOZG
సి) GVOZMG డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
ఎ) IPPQT బి) IPTQP
సి) UQOTO డి) ఏదీకాదు

5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు

6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
ఎ) CHUSPNL బి) HNCPLHU
సి) CNHUSPL డి) ఏదీకాదు

7 - 10
ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

7. NOSE కు సరైన కోడ్?
ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు

8. AIM కు సరైన కోడ్?
ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు

9. MIND కు సరైన కోడ్?
ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు

10. HOME కు సరైన కోడ్?
ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు

11. 6, 7, 16, 51, ---------
ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు

12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు

13. 8, 3, 2, 3, 10, --------
ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు

14. 5, 4, 6, 15, 56, -------
ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు

15. 9, 15, 43, 83, 247, -----------
ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు

16. a - bc - ab - cdabc - da - cd - ----
ఎ) abbcdd బి) adbcbd
సి) abcdbd డి) ఏదీకాదు

17. ab - b - cacc - b - a - cb
ఎ) cbaab బి) aabbc
సి) adcab డి) ఏదీకాదు

18. d - dba - a - db - - a - ac
ఎ) bcdbcc బి) bbcccd
సి) bccdbc డి) ఏదీకాదు

19. ప్రకటనలు: అన్ని జిల్లాలు రాష్ట్రాలు
అన్ని రాష్ట్రాలు దేశాలు
సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు


20. ప్రకటనలు: ఏ సెకను నిమిషం కాదు
కొన్ని నిమిషాలు గంటలు
సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
3. కొన్ని గంటలు నిమిషాలు
4. అన్ని సెకన్లు గంటలు
ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు



Panditi Meenakshi Pavan
Senior Faculty


Competitive Exams Special

21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 20 బి) 22 సి) 18 డి) 14

22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?



ఎ) 8 బి) 9 సి) 10 డి) 11

23 - 25
భిన్నమైనదాన్ని తెలపండి

23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH

26 - 30
A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B
పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
సి) D మేనకోడలు A డి) ఏదీకాదు

27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A మామగారు C బి) D భర్త C
సి)D కుమార్తె B డి) A తండ్రి D

28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A కోడలు C బి) C భార్య B
సి) B భర్త C డి) C మామగారుA

29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
సి) A తండ్రి D డి) D భర్త C

30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కోడలు B బి) C అత్తగారు A
సి) C తండ్రి D డి) D తండ్రి C

31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు

32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Honey 2. Heart 3. Home
4. Health 5. Help
ఎ) Help బి) Home
సి) Heart డి) Honey


33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు

34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగాను, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగాను రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
ఎ) JaNuaRy బి)JANuary
సి) JAnuARy డి) ఏదీకాదు

35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరాన్ని తెలపండి?
ఎ)A బి) B సి) O డి) N

36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
ఎ) L బి) M సి) N డి) P


(37-40)



పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి

37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను

41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?



ఎ) 5 బి) 6 సి) 3 డి) 1

